www.vishalabharati.com
epaper.vishalabharati.com

శనివారం, హైదరాబాద్
14 నవంబర్ 2026
సంపుటి:4 సంచిక: 306

విశాల భారతి

తెలుగు దినపత్రిక

నిమ్స్‌లో రూ.100 కోట్ల స్కామ్

- హరీష్ రావును రాజకీయాల నుంచి తరిమికొడతానని కవిత శపథం
- కాళేశ్వరం, మల్లన్నసాగర్ పనుల్లో అవినీతి జరిగిందని ఆరోపణ
- హరీష్ రావు ఆస్తులపై విచారణ జరపాలని డిమాండ్
- హరీష్ అవినీతి ఆధారాలు సీఎంకు ఇస్తానన్న కవిత
- రేవంత్ రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని విమర్శ
- సిద్దిపేటలో తెలంగాణ రక్షణ సేన జెండా ఎగురవేస్తామని ధీమా

02





ఖైరతాబాద్ ఉపఎన్నికపై కొత్త ట్విస్ట్

- ఖైరతాబాద్ ఉపఎన్నికపై హైకోర్టులో కొనసాగుతున్న విచారణ
- ఉపఎన్నిక ఆలస్యం కాకూడదని చింతల రామచంద్రారెడ్డి పిటిషన్
- విజయారెడ్డి పిటిషన్‌లో ఇంప్లీడ్ కోరిన చింతల
- రెండో స్థానంలో ఉన్నవారిని ఎమ్మెల్యేగా ప్రకటించడం చెల్లదని వాదన
- ఖైరతాబాద్‌కు ఉపఎన్నిక నిర్వహించాల్సిందేనని డిమాండ్
- హైకోర్టు తీర్పుపైనే ఉపఎన్నికపై స్పష్టత వచ్చే అవకాశం

02



గ్యాస్ సిలిండర్ల బ్లాక్ దందా!

- గ్రేటర్ పరిధిలో యథేచ్ఛగా విక్రయాలు
- ఏజెన్సీల నుంచి నేరుగా వ్యాపారులకు సరఫరా!
- ఒక్కో సిలిండర్ రూ.2,500కు విక్రయం

03

హైదరాబాద్ నగరంలోని హైటెక్స్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్‌పై బీజేపీ, బీఆర్ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. రాహుల్ గాంధీ ముఖ్య అతిథిగా భారత్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు వస్తున్నందుకు మీకు కడుపులో విషం ఉండొచ్చు.. కళ్లల్లో కోపం ఉండొచ్చు.. కానీ తెలంగాణ ప్రజల మీద ప్రదర్శించకండి.. రాష్ట్రానికి నష్టం చేకూరుతుందని సీఎం పేర్కొన్నారు. కాబట్టి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ చీఫ్ రామచందర్ రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞత ప్రదర్శించాలని సూచించారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్డీ ఇన్‌స్టిట్యూట్‌లోని బోధి పెవిలియన్‌లో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.

భారత్ సమ్మిట్‌పై కేంద్రం కుట్ర

భారత్ సమ్మిట్‌పై విమర్శలకు రేవంత్ కౌంటర్

తెలంగాణ ప్రయోజనాల కోసం సమ్మిట్ నిర్వహిస్తున్నామని వెల్లడి

70 దేశాల నుంచి వెయ్యి మంది ప్రతినిధులకు ఆహ్వానం

విదేశీ ప్రతినిధుల వీసాలు రద్దు చేస్తున్నారని ఆరోపణ

రాహుల్ గాంధీ రాకపై బీజేపీ ద్వంద్వ వైఖరి వీడాలన్న సీఎం

తెలంగాణకు నష్టం చేయొద్దని బీజేపీ, బీఆర్ఎస్‌కు హితవు



విశాలభారతి, స్టేట్ బ్యూరో:


మౌలిక వసతులు, వాతావరణ పరిస్థితులు, కంపెనీల పెట్టుబడులు వివరాలను ఈ రోజు ప్రపంచానికి తెలియజేప్పడానికి భారత్ సమ్మిట్ నిర్వహిస్తున్నాం. గతేడాది కూడా గ్లోబల్ సమ్మిట్ కంటే ముందు భారత్ సమ్మిట్ నిర్వహించాం. ఈరోజు తెలంగాణ ప్రభుత్వం డిసెంబర్ 7, 8, 9 వరకు గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా పెట్టుబడులకు సానుకూలమైన రాష్ట్రంగా, పెట్టుబడులు పెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన విధివిధానాలతో ముందుకు వెళ్తున్నది. ప్రపంచ స్థాయి పెట్టుబడి సంస్థలు పెట్టుబడులు పెట్టడానికి వసతులు కల్పిస్తామని రాష్ట్రం ఈ కార్యక్రమం నిర్వహిస్తుంది అని రేవంత్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌పై బెంగళూరు, చెన్నై, ఢిల్లీలో కార్యక్రమాలు నిర్వహించాం. ముంబై, అహ్మదాబాద్‌లో కూడా త్వరలోనే నిర్వహిస్తాం. అందులో భాగంగానే హైదరాబాద్‌లో నవంబర్ 13, 14 తేదీల్లో సమ్మిట్ ద్వారా 70 దేశాలకు చెందిన 1000 మంది ప్రతినిధులను ఆహ్వానించాం. విదేశాల నేతలు పర్యటనకు సిద్ధమై ఎయిర్‌పోర్టుకు వచ్చిన తర్వాత బీజేపీ ప్రభుత్వం ఆఖరి నిమిషంలో వీసాలను రద్దు చేసి పర్యటనను అడ్డుకుంటున్నారు అని సీఎం మండిపడ్డారు. కిషన్ రెడ్డి, రామచందర్ రావు, కేటీఆర్.. భారత్ వ్యతిరేక సమ్మిట్ అంటూ ప్రజా యోజనాలు లేవు.. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. బీఆర్ఎస్, బీజేపీ ఒకే విధి విధానాలతో తెలంగాణ ప్రజలకు వ్యతిరేకంగా కార్యాచరణ తీసుకుని, ప్రజలకు అనుకూలమైన నిర్ణయాలు తీసుకుంటే గుడ్డిగా వ్యతిరేకించే ప్రయత్నం చేస్తున్నారు. వివిధ దేశాలకు చెందిన పార్లమెంట్ సభ్యులు, మంత్రులు, పర్యావరణ, ఆర్థిక శాస్త్రవేత్తలుగా ఉన్నవారిని ఆహ్వానించడం జరిగింది. విదేశాల్లోని సీనియర్ జర్నలిస్టులను కూడా ఆహ్వానించాం. ఎందుకంటే తెలంగాణ, హైదరాబాద్ గురించి మాటల్లో ఎంత చెప్పినా కొంతనే అవగాహన కలుగుతుంది. పాలసీలను వివరించడం ద్వారా, క్షీణించిపోతున్న

మిగతా 2లో..

భారత్ సమ్మిట్‌లో దేశ వ్యతిరేక శక్తులు

- భారత్ సమ్మిట్‌పై బండి సంజయ్ తీవ్ర విమర్శలు
- విదేశీ శక్తులతో కలిసి దేశ వ్యతిరేక కుట్ర చేస్తున్నారని ఆరోపణ
- సమ్మిట్ ఉద్దేశం, ఖర్చులపై రాహుల్, రేవంత్‌కు ప్రశ్నలు
- తెలంగాణ ప్రజలకు సమ్మిట్‌తో ఏం ప్రయోజనమని నిలదీత
- గత సమ్మిట్‌లో రూ.29.45 కోట్ల ప్రజాధనం ఖర్చుపై ప్రశ్నలు
- గత సమ్మిట్ ఫలితాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్

02



500 ఉన్నత పాఠశాలల్లో 11, 12వ తరగతులు

- కాలేజీలు దూరంగా ఉన్న పాఠశాలల్లో 12వ తరగతి తప్పనిసరి
- విద్యాశాఖ అధికారుల భేటీలో నిర్ణయం
- హైస్కూళ్లు.. హయ్యర్ సెకండరీ స్కూళ్లుగా ఉన్నతీకరణ
- వచ్చే ఏడాది నుంచి అమల్లోకి
- పరీక్షల నిర్వహణకు కొనసాగనున్న ఎస్ఎస్‌సీ, ఇంటర్ బోర్డులు

03

హైదరాబాద్‌లో 2 రోజుల భారత్ సమ్మిట్



- 70 దేశాల నుంచి వెయ్యి మంది ప్రతినిధుల హాజరు
- నవంబర్ 14న రాహుల్ గాంధీ కీలక ప్రసంగం
- ఏఐ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రత్యేక చర్చలు
- తెలంగాణ అభివృద్ధిపై తొమ్మిది ప్రత్యేక సమావేశాలు
- సమ్మిట్ నిర్వహణపై బీజేపీ తీవ్ర విమర్శలు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

హైదరాబాద్‌లో భారత్ సమ్మిట్ 2026 పేరుతో భారీ అంతర్జాతీయ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో నవంబర్ 13, 14 తేదీల్లో హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్, నోవాటెల్ హోటల్ వేదికగా ఈ సదస్సు జరగనుంది. దాదాపు 70 దేశాల నుంచి వెయ్యి మంది ప్రతినిధులు హాజరుకానుండటం విశేషం. ప్రపంచ రాజకీయ నాయకులు, మంత్రులు, పార్లమెంటేరియన్లు, విధాన నిపుణులు, విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు ఈ వేదికపై సమావేశం కానున్నారు. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న రాజకీయ పరిస్థితులు, ఆర్థిక అసమానతలు, ప్రజాస్వామ్యానికి ఎదురవుతున్న సవాళ్లపై ప్రధానంగా చర్చించనున్నారు. భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 137వ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. భారత స్వాతంత్ర్యానికి 80 ఏళ్లు పూర్తవుతున్న సందర్భాన్ని కూడా సదస్సు లక్ష్యాలతో అనుసంధానించారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ విధాన చర్చలకు కేంద్రంగా నిలబెట్టడం తెలంగాణ

మిగతా 3లో..



సిగ్గులేకుండా రాష్ట్రానికి వస్తున్నావా?

- రాహుల్ తెలంగాణ పర్యటనపై కేటీఆర్ విమర్శలు
- రూ.100 కోట్ల ప్రజాధనంతో ప్రచారమంటూ ఆరోపణ
- విద్యార్థుల సమస్యలపై మౌనమెందుకని ప్రశ్న
- హైడ్రా కూల్చివేతలపై స్పందించలేదని విమర్శ
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరికపై నిలదీత
- రైతులు, నేతన్నల సమస్యలపై మౌనమెందుకని ప్రశ్న

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి మాటల యుద్ధం తారస్థాయికి చేరుకుంది. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ రాష్ట్ర పర్యటనకు సిద్ధమవుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు

మిగతా 3లో..

నా మొబైల్‌ను ట్యాప్ చేస్తున్నారు

- మోదీకి రాహుల్ బహిరంగ చర్చ సవాల్
- చర్చకు వస్తే రాజకీయ జీవితం ముగుస్తుందన్న రాహుల్
- ఫోన్‌లోనే అన్ని ఆధారాలున్నాయని వెల్లడి
- తన ఫోన్ ట్యాపింగ్ అవుతోందని ఆరోపణ
- పార్లమెంటులో మాట్లాడనివ్వడం లేదని విమర్శ
- 'దిమాగీ నక్సల్స్' వ్యాఖ్యలతో ముదిరిన వివాదం



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ప్రధాని నరేంద్ర మోదీకి లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి ఓపెన్ ఛాలెంజ్ విసిరారు. తనతో ముఖాముఖి చర్చకు వస్తే మోదీ రాజకీయ భవిష్యత్తే మారిపోతుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన వీడియో క్లిప్‌లలో రాహుల్ చేసిన కామెంట్లు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ప్రధాని తనతో డిబేట్‌కు వస్తే ఆ తర్వాత పదవిలో కొనసాగలేరని రాహుల్ ధీమా వ్యక్తం చేశారు. ఈ విషయం ఇద్దరికీ తెలుసంటూ వ్యాఖ్యానించారు. తనను పదేపదే దేశద్రోహిగా చిత్రీకరిస్తున్నారని, అసలు దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నది ఎవరో ప్రజల ముందు బయటపెడతానని ప్రకటించారు. సాధారణ రాజకీయ ప్రసంగాలతో కూడిన చర్చ తనకు అవసరం లేదని స్పష్టం చేశారు. ఇద్దరూ నేరుగా కూర్చుని ప్రశ్నలకు సమాధానాలు చెప్పుకునే డిబేట్ జరగాలని డిమాండ్ చేశారు. ఈ సవాల్‌తో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం మరింత వేడెక్కింది.

మిగతా 3లో..



అమ్మకాలకు కేరాఫ్ అడ్రస్‌గా రేవంత్

- రేవంత్ రెడ్డి భూముల చుట్టే తిరుగుతున్నారంటూ హరీశ్ రావు విమర్శ
- కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలంపై బీఆర్ఎస్ ఆగ్రహం
- ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్, పోలీస్ స్టేషన్లు కూడా అమ్ముతారా? అని ప్రశ్న
- కాంగ్రెస్ ప్రభుత్వం రూ.26 వేల కోట్ల భూములు అమ్మేసిందని ఆరోపణ
- భూములను పేద రైతులకు లేదా ప్రజా అవసరాలకు కేటాయించాలని డిమాండ్
- వేలంలో కొన్న భూములకు అనుమతులు ఇవ్వబోమని హరీశ్ రావు హెచ్చరిక

03

నిమ్స్‌లో రూ.100 కోట్ల స్కామ్

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

సిద్దిపేట రాజకీయాల్లో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలతో కొత్త చర్చకు తెరలేపారు. శుక్రవారం సిద్దిపేటలో పార్టీ నూతన కార్యాలయ భవన నిర్మాణానికి భూమిపూజ నిర్వహించిన అనంతరం మాజీ మంత్రి హరీశ్ రావుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సిద్దిపేటలో హరీశ్ రావు రాజకీయ ఆధిపత్యానికి ముగింపు పలకడమే తమ లక్ష్యమని ప్రకటించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల నుంచే తమ పోరాటం ప్రారంభమవుతుందని స్పష్టం చేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతితో తనకు ఎలాంటి సంబంధం లేదని, తన ఆస్తులపై ఎలాంటి విచారణకైనా సిద్ధమని సవాల్ విసిరారు. హరీశ్ రావు ఆస్తుల పెరుగుదలపై కూడా చర్చ జరగాలని డిమాండ్ చేశారు. 2003 నుంచి 2023 వరకు ఆయన ఎన్నికల అఫిడవిట్లను బయటపెడితే అనేక విషయాలు తెలుస్తాయని వ్యాఖ్యానించారు. సిద్దిపేటలో తెలంగాణ రక్షణ సేన జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి మల్లన్నసాగర్ వరకు హరీశ్ రావు తీసుకున్న నిర్ణయాలపై కల్వకుంట్ల కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. కాళేశ్వరం కోసం రూ.93 వేల కోట్లు ఖర్చు చేసినప్పటికీ ఉమ్మడి మెదక్ జిల్లాలోని పది లక్షల ఎకరాల్లో కేవలం లక్ష ఎకరాలకు మాత్రమే సాగునీరు అందిందని విమర్శించారు. మల్లన్నసాగర్ నిర్మాణ అంచనాలను రూ.6 వేల కోట్ల నుంచి రూ.9 వేల కోట్లకు పెంచారని ఆరోపించారు. ఎన్డీఆర్ఐ నివేదికలను పక్కనపెట్టి నాసిరకం నిర్మాణాలు చేపట్టారని, బండ్ లీకేజీ వ్యవహారాన్ని కప్పిపుచ్చేందుకు బ్లాస్టింగ్ పేరుతో హడావుడి చేస్తున్నారని వ్యాఖ్యానించారు. కొండపోచమ్మ సాగర్ నుంచి కేసీఆర్ ఫామ్‌హౌస్ బావికి ప్రత్యేక కాలువ ఉందనే అంశంపై బీఆర్ఎస్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రంగనాయక సాగర్ నిర్వాసితులకు సరైన పరిహారం అందలేదని, హరీశ్ రావు మాత్రం తన 14 ఎకరాలకు ఎకరాకు రూ.6 లక్షల చొప్పున పరిహారం తీసుకుని గెస్ట్‌హౌస్ నిర్మించుకున్నారని ఆరోపించారు. నీటి ప్రాజెక్టుల ఖర్చులు, నిర్మాణ నాణ్యతపై సమగ్ర విచారణ జరగాలని కోరారు. సిద్దిపేట అభివృద్ధి పేరుతో జరిగిన పలు వ్యవహారాలపైనా కవిత విమర్శలు గుప్పించారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని మార్చడం వెనుక భూముల వ్యవహారం ఉందని, వెంకటేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన ఐదు ఎకరాల స్థలం విషయంలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. హరీశ్ రావు వైద్యారోగ్య శాఖ మంత్రిగా ఉన్న సమయంలో నిమ్స్ ఉద్యోగుల రూ.25 కోట్ల ఈపీఎఫ్ నిధులను మళ్లించి రూ.100 కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారని వ్యాఖ్యానించారు. సిబ్బంది లేకుండానే సిద్దిపేటలో వెయ్యి పడకల ఆస్పత్రిని ప్రారంభించారని విమర్శించారు. ప్రైవేట్ కాలేజీలపై ఒత్తిడి తెచ్చి రూ.2 వేల కోట్ల పాల వ్యాపారం నిర్వహించారని, సింగరేణి బొగ్గు రవాణాలోనూ అవకతవకలు జరిగాయని ఆరోపించారు. హరీశ్ రావు ఎమ్మెల్యే కాకముందే సిద్దిపేటలో ఔటర్ రింగ్ రోడ్డు, సబ్‌స్టేషన్లు, ఇంటింటికీ నల్లా సౌకర్యం ఉండేదని గుర్తుచేశారు. ఒకప్పుడు 120 రైస్ మిల్లులు ఉండగా ఇప్పుడు 20కి తగ్గాయని పేర్కొన్నారు. కార్పొరేట్ సంస్థల రాకతో స్థానిక వ్యాపారులు, పద్మశాలీలు, స్వర్ణకారుల ఉపాధి దెబ్బతిందని విమర్శించారు. మాజీ మంత్రి హరీశ్ రావుతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపైనా కల్వకుంట్ల కవిత విమర్శలు చేశారు. హరీశ్ రావు వ్యవహారాలపై ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. రెండు పార్టీల నేతల మధ్య రాజకీయ అవగాహన ఉందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. కొండపోచమ్మ సాగర్ వ్యవహారంలో ఇంజనీర్ల నుంచి నిధులు రికవరీ చేయాలని నివేదిక వచ్చినా ప్రభుత్వం ముందుకు వెళ్లడం లేదని విమర్శించారు. హరీశ్ రావుకు సంబంధించిన ఆధారాలను ముఖ్యమంత్రికి అందిస్తానని ప్రకటించారు. ఈ నెల 19న సిద్దిపేటకు రానున్న రేవంత్ రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యవసాయ రంగంపై అవగాహన లేదని విమర్శించారు. లోయర్ మానేరు డ్యామ్ నుంచి మల్లన్నసాగర్ నింపాలని ఏడాది క్రితమే సూచించినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. గౌరవెల్లి నిర్వాసితులకు పరిహారం అందలేదని, ఆర్టీసీ విలీనం కోసం ప్రాణత్యాగం చేసిన శంకర్ గౌడ్ ఆశయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ నెరవేర్చలేదని ఆరోపించారు. తెలంగాణ రక్షణ సేన స్థాపన వెనుక ఉన్న రాజకీయ లక్ష్యాలను కూడా కల్వకుంట్ల కవిత వివరించారు. బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ అయిన తర్వాత ఏడాది పాటు మేధావులతో చర్చలు నిర్వహించానని చెప్పారు. మొత్తం 50 కమిటీల ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్న తర్వాతే కొత్త రాజకీయ పార్టీని ప్రారంభించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ రంగంతో పాటు ప్రైవేట్ రంగంలోనూ ఉచిత విద్య, వైద్యం అందుబాటులోకి తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యమని ప్రకటించారు. తెలంగాణ ఉద్యమంలో 1,200 మంది అమరులయ్యారని గుర్తుచేస్తూ వారి త్యాగాలకు తగిన గౌరవం దక్కాలని పేర్కొన్నారు. ఉద్యమ సమయంలో హరీశ్ రావు పెట్రోలు పోసుకున్న ఘటనను ప్రస్తావిస్తూ అగ్గిపెట్టె దొరకలేదనే అంశంపై వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. సిద్దిపేటలో రాజకీయ మార్పు తీసుకురావడానికి ప్రజలు తమ పార్టీకి ఒక అవకాశం ఇవ్వాలని కోరారు. మున్సిపల్ ఎన్నికల నుంచే తెలంగాణ రక్షణ సేన రాజకీయ బలాన్ని నిరూపించుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.





ఆలయాల్లో దొంగల బీభత్సం

- బంగారం, వెండి ఆభరణాలు అపహరణ
- ఓంశక్తి, సాయిబాబా మందిరాల్లో చోరీలు
- వరుస దొంగతనాలతో బెంబేలెత్తుతున్న మండల ప్రజలు

అశ్వాపురం-విశాల భారతి :

ప్రజలు ఎంతో భక్తి శ్రద్ధలతో పూజించుకునే ఆలయాల్లో కూడా దొంగలు ప్రతాపాన్ని ప్రదర్శించి ఏకంగా దేవుళ్ళ నగలనే ఎత్తుకెళ్లిన సంఘటనలో భక్తులు, మండల ప్రజలు నివేరపోతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని ఓం శక్తి ఆలయం, సాయిబాబా మందిరాల్లో శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడి విలువైన ఆభరణాలను అపహరించుకు వెళ్లారు.ప్రజలు ఎంతో భక్తితో కొలిచే దేవాలయాల్లో దేవుళ్లకు అలంకరించిన ఆభరణాలు దొంగలు ఎత్తుకెళ్లడంతో భక్తుల్లో ఆందోళన కలిగిస్తోంది.గతంలోనూ మండల పరిధిలో పలు దొంగతనాలు చోటుచేసుకోవడం, తాజాగా ఆలయాల్లో చోరీలు జరగడం మండలంలో చర్చాలి అంశంగా మారింది. మరోవైపు ఆలయాల వద్ద సరైన నిఘా వ్యవస్థ లేకపోవడం వలనే దొంగలు రెచ్చిపోతున్నారని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రజల ఆస్తులకే కాకుండా దేవుడి సొత్తుకు కూడా రక్షణ లేకపోతే పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలంటున్న ప్రజలు

అశ్వాపురం మండలంలో వరుసగా జరుగుతున్న దొంగతనాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. రాత్రి వేళల్లో పోలీసుల గస్తీని ముమ్మరం చేయడంతో పాటు ప్రధాన కూడళ్లు, ఆలయాల పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజల్లో భద్రతాభావం కల్పించేందుకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రజలు అంటున్నారు.దొంగతనం జరిగిన విషయం తెలిసిన వెంటనే అశ్వాపురం సిఐ తన సిబ్బందితో కలిసి ఓం శక్తి, శిరిడి సాయిబాబా ఆలయాలను సందర్శించి చోరీ జరిగిన తీరుతెన్నులపై విచారణ చేపట్టారు. అదేవిధంగా క్లూస్ టీం తో ఆధారాలను సేకరిస్తున్నారు.

ఖైరతాబాద్ ఉపఎన్నికపై కొత్త ట్విస్ట్



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నిక వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. దానం నాగేందర్‌పై అనర్హత వేటు పడటంతో ఖాళీ అయిన ఈ స్థానానికి ఉపఎన్నిక ఎప్పుడు జరుగుతుందనే ఉత్కంఠ నెలకొన్నవేళ.. తాజాగా బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి రంగంలోకి దిగడం రాజకీయ సమీకరణాలను మరింత ఆసక్తికరంగా మార్చింది. ఉపఎన్నికను వీలైనంత త్వరగా నిర్వహించాలని కోరుతూ ఆయన తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఇప్పటికే విజయారెడ్డి దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్ విచారణలో ఉండగా.. ఆ కేసులో తన వాదనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని చింతల ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో ఖైరతాబాద్ ఉపఎన్నిక చుట్టూ సాగుతున్న న్యాయపోరాటం కొత్త మలుపు తిరిగింది. ఈ వ్యవహారం కేవలం ఒక నియోజకవర్గానికి పరిమితమైన అంశం కాదు. వచ్చే ఉపఎన్నికలో మూడు ప్రధాన పార్టీలకు రాజకీయంగా కీలకంగా మారే అవకాశం ఉండటంతో అందరి దృష్టి ఇప్పుడు హైకోర్టు వైపు మళ్లింది. 2023 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే ఈ వివాదానికి అసలు కారణం స్పష్టంగా అర్థమవుతుంది. అప్పట్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన దానం నాగేందర్ 67,368 ఓట్లతో విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి పి. విజయారెడ్డికి 45,358 ఓట్లు రాగా, బీజేపీ నుంచి పోటీ చేసిన చింతల రామచంద్రారెడ్డికి 38,094 ఓట్లు వచ్చాయి. అయితే ఎన్నికల తర్వాత దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీలో చేరి సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయడంతో పార్టీ ఫిరాయింపుల వివాదం తెరపైకి వచ్చింది. ఈ వ్యవహారంపై జరిగిన న్యాయపోరాటం చివరకు ఆయన అనర్హతకు దారితీసింది. సెప్టెంబర్ 18న తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేయగా, సెప్టెంబర్ 26న ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు అసెంబ్లీ సచివాలయం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో రాజ్యాంగపరంగా ఈ స్థానానికి ఉపఎన్నిక నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కానీ ఇక్కడే మరో న్యాయపరమైన చిక్కు వచ్చి పడింది. దానం నాగేందర్ ఎన్నిక చెల్లదని ప్రకటించాలని కోరుతూ కాంగ్రెస్ నేత విజయారెడ్డి గతంలోనే హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. ఆమె ప్రధానంగా తన పిటిషన్‌పై తుది నిర్ణయం వచ్చే వరకు ఉపఎన్నిక నిర్వహించకూడదని కోరుతున్నారు. ఈ అంశంపై ఎన్నికల సంఘం కూడా కోర్టుకు తన వైఖరిని తెలియజేస్తూ, పెండింగ్‌లో ఉన్న ఎన్నికల పిటిషన్ పరిష్కారమైన తర్వాతే ఉపఎన్నిక నిర్వహణపై ముందుకు వెళ్తామని తెలిపింది. ఇక్కడ అసలు రాజకీయ, న్యాయపరమైన చిక్కు ఏమిటంటే.. దానం నాగేందర్ ఎన్నిక చెల్లదని కోర్టు ప్రకటిస్తే తదుపరి చర్యలు ఎలా ఉండాలనేది. రెండో స్థానంలో నిలిచిన విజయారెడ్డిని ఎమ్మెల్యేగా ప్రకటించాలనే వాదన ఒకవైపు వినిపిస్తోంది. అదే జరిగితే ఉపఎన్నిక అవసరమే ఉండదు. కానీ మరోవైపు విజేత ఎన్నిక రద్దయినంత మాత్రాన రెండో స్థానంలో ఉన్న అభ్యర్థికి నేరుగా ఎమ్మెల్యే పదవి దక్కుతుందా అనే ప్రశ్న కూడా న్యాయపరంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఒక్క అంశమే ఖైరతాబాద్ ఉపఎన్నిక భవిష్యత్తును నిర్ణయించే కీలకమైన అంశంగా మారింది. ఇదే విషయాన్ని ప్రధానంగా ప్రస్తావిస్తూ చింతల రామచంద్రారెడ్డి తన ఇంప్లీడ్ పిటిషన్‌లో కీలక వాదనలు వినిపిస్తున్నారు. ఖైరతాబాద్‌లో 2023 ఎన్నికలు బహుముఖ పోటీగా జరిగాయని, విజేతకు వచ్చిన ఓట్లన్నీ రెండో స్థానంలో ఉన్న అభ్యర్థికే వచ్చేవని భావించడం సరికాదని ఆయన అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల్లో ఓటర్లు వివిధ పార్టీల అభ్యర్థులకు తమ రాజకీయ అభిప్రాయాలు, సిద్ధాంతాలు, స్థానిక సమస్యలు, అభ్యర్థుల ఎంపిక ఆధారంగా ఓట్లు వేస్తారని పేర్కొంటున్నారు. అలాంటప్పుడు మొదటి స్థానంలో ఉన్న అభ్యర్థి అనర్హతకు గురైతే రెండో స్థానంలో ఉన్న వ్యక్తిని నేరుగా విజేతగా ప్రకటించడం ప్రజల అసలు తీర్పును ప్రతిబింబించకపోవచ్చనేది ఆయన వాదన. అందుకే ప్రజలకు మరోసారి ఓటు వేసే అవకాశం కల్పించి ఉపఎన్నిక నిర్వహించడమే సరైన మార్గమని చెబుతున్నారు. విజయారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేయాలని కూడా కోరినట్లు తెలుస్తోంది. అంతేకాదు, నియోజకవర్గానికి ప్రస్తుతం ఎన్నికైన ప్రజాప్రతినిధి లేకపోవడం వల్ల అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారం ప్రభావితమవుతున్నాయని ఆయన ప్రస్తావిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు ప్రాతినిధ్యం కల్పించడం అత్యంత కీలకమని, న్యాయపరమైన ప్రక్రియల పేరుతో ఉపఎన్నికను నిరవధికంగా ఆలస్యం చేయడం సమంజసం కాదన్నది చింతల వాదనలో ప్రధానాంశం. మొత్తానికి ఖైరతాబాద్ ఉపఎన్నిక వ్యవహారం ఇప్పుడు కోర్టు తీర్పుపైనే ఆధారపడి ఉంది. ఒకవేళ ఉపఎన్నికకు మార్గం సుగమమైతే కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య త్రిముఖ పోరు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత ఎన్నికల్లో గెలిచిన దానం నాగేందర్ ఇప్పుడు రాజకీయంగా వేరే పార్టీలో ఉండటం, ఆయన అనర్హతతో ఏర్పడిన ఖాళీ, విజయారెడ్డి చేస్తున్న న్యాయపోరాటం, చింతల రామచంద్రారెడ్డి తాజా పిటిషన్.. ఇవన్నీ ఈ నియోజకవర్గాన్ని రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి. కాంగ్రెస్ అధికారంలో ఉన్న నేపథ్యంలో ఈ స్థానాన్ని నిలబెట్టుకోవడం ఆ పార్టీకి ప్రతిష్ఠాత్మకంగా మారవచ్చు. మరోవైపు బీఆర్ఎస్ గత ఎన్నికల్లో గెలిచిన స్థానాన్ని తిరిగి దక్కించుకోవాలని ప్రయత్నించే అవకాశం ఉంది. బీజేపీకి కూడా ఖైరతాబాద్‌లో తన బలాన్ని నిరూపించుకునేందుకు ఇది కీలకమైన వేదిక కావచ్చు. అయితే ఈ రాజకీయ అంచనాలన్నింటికంటే ముందుగా పరిష్కారం కావాల్సింది న్యాయపరమైన వివాదమే. చింతల ఇంప్లీడ్ పిటిషన్‌పై హైకోర్టు తీసుకునే నిర్ణయం, విజయారెడ్డి ఎన్నికల పిటిషన్‌పై వెలువడే తీర్పు, ఆ తర్వాత ఎన్నికల సంఘం అనుసరించే విధానం.. ఈ మూడు అంశాలే ఉపఎన్నిక భవిష్యత్తును నిర్ణయించనున్నాయి. అప్పటివరకు ఖైరతాబాద్ రాజకీయాల్లో ఉత్కంఠ కొనసాగడం ఖాయం.

భారత్ సమ్మిట్‌పై కేంద్రం కుట్ర

మొదటిపేజీ తరువాయి

ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టడానికి చర్చల ద్వారానే ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవచ్చనే నమ్మకంతో పార్టీ ప్రభుత్వంగా ఈ కార్యక్రమాన్ని తీసుకున్నాం. అయితే కేటీఆర్, కిషన్ రెడ్డి, రామచందర్ రావుకు ఎందుకు అభ్యంతరమో అర్థం కావడం లేదు. అర్థం లేని ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు అని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రెండు రోజుల సమావేశాల్లో వాతావరణ పరిస్థితులు, మౌలిక వసతులు, పెట్టుబడులు, మానవ వనరుల గురించి వివరించడం ద్వారా రాష్ట్రం ఒక అనువైన పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దాలి. ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలి. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్స్ ఎకానమీ ఆర్థిక వ్యవస్థన పెపొందించాలని ప్రయత్నిస్తున్నాం. కానీ ప్రతిపక్ష నేతలు మూసీని వ్యతిరేకించారు. మెట్రో విస్తరణ, రేడియల్ రోడ్స్, ట్రిపుల్ ఆర్‌ను వ్యతిరేకించారు. ప్రజా ప్రయోజనాలను తీసుకుంటే వాళ్లు వ్యతిరేకిస్తున్నారు. పాలమూరు ఎత్తిపోతల పూర్తి చేస్తామంటే, తుమ్మిడిహెట్టి పరిష్కరిస్తామంటే వ్యతిరేకిస్తున్నారు. ఏ నిర్ణయాన్ని కూడా ముందుకు సాగనివ్వకుండా ఈ రోజు బీజేపీ, బీఆర్ఎస్ నేతలు కూడబలుక్కొని వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు. ప్రజలకు వ్యతిరేకంగా ఉంటూ విఘాతం కలిగిస్తున్నారు అని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. గిగ్ వర్కర్లకు సమస్యలు ఉన్నాయి. వేలాది మంది గిగ్ వర్కర్లకు రక్షణ చట్టం లేదు.. ప్రతిపక్షాలకు ఆదుకోవాలన్న ఆలోచన కూడా లేదు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు గిగ్ వర్కర్స్ పాలసీ అమలు చేయాలనుకున్నాం. ఈ క్రమంలోనే రాహుల్ గాంధీని ముఖ్య అతిథిగా ఆహ్వానించాం. వారిని ఉద్దేశించి ప్రసంగిస్తారు. భారత్ సమ్మిట్ ముగింపు సందర్భంగా రాహుల్ వస్తున్నారు. ఆయన వస్తుంటే బీజేపీకి ఉన్న అభ్యంతరం అర్థం కావడం లేదు. రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో ప్రతిపక్ష నేత అటల్ బీహారి వాజపేయిని విదేశాలకు ముఖ్య అతిథిగా పంపించారు. ప్రధాని ఏఐ, బ్రిక్స్ సమ్మిట్ చేస్తారు. ఇతర దేశాలకు చెందిన ముఖ్యమైన వారితో సమ్మిట్ పెడుతారు. చైనా అధ్యక్షుడిని పిలుస్తారు. పాకిస్తాన్‌తో వైరం ఉందని చెప్పి కూడా నవాజ్ షరీఫ్ వద్ద బిర్యానీ తిని వస్తారు. మోదీ ఏది చేసినా కరెక్టే.. రాహుల్ ఏది చేసినా తప్పే అన్నట్టుగా వ్యవహరించడం సరికాదు. ఆయనకు కేబినెట్ ర్యాంకు ఉంది. ఈ రోజు సమావేశాలను ఉద్దేశించి ప్రసంగిస్తున్నారు. విదేశాలకు భారత ప్రతినిధిగా వాజపేయిని పంపించి రాజీవ్ కొత్త సంప్రదాయానికి తెరలేపారు. మరి మీరు ఎందుకు రాహుల్‌ను అవమానిస్తున్నారు. బీజేపీ వైఖరి నియంతలా వైఖరిలా మారింది. ప్రజాస్వామ్యంలో అందరి అభిప్రాయాలు తీసుకుని, అందులో ఉత్తమ విధానాలను అమలు చేస్తాం. రాజ్యాంగాన్ని 106 సార్లు సవరించుకున్నాం ఉత్తమ పరిపాలనకు అని సీఎం గుర్తు చేశారు. ప్రపంచంలో ఎక్కడా చూసినా అలజడి.. ఎన్నో రకాల యుద్ధాలు జరుగుతున్నాయి. శాంతి కోసం చర్చలు జరగాల్సిన అవసరం ఉంది. 70 దేశాల నుంచి వెయ్యి మంది అతిథులుగా వస్తే.. వారు తిరిగి వెళ్లేటప్పుడు వారు తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్స్‌గా మారుతారు. వెయ్యి మందిని హైదరాబాద్‌కు రప్పించి ఒక దగ్గర కూర్చోబెట్టి వివిధ సెమినార్లు నిర్వహించి నిపుణులతో చర్చించి తీర్మానాలు చేసి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవడమే కాకుండా, ప్రజాస్వామ్య యుతమైన వాతావరణం తెలంగాణలో ఉంది.. పెట్టుబడులకు తెలంగాణలో అనుకూల వాతావరణం ఉందని చెప్పడానికి ప్రయత్నం చేస్తున్నాం. కిషన్ రెడ్డి, కేటీఆర్, రామచందర్ రావు విజ్ఞత ప్రదర్శించాలి. మీకు కడుపులో విషం ఉండొచ్చు. కళ్లల్లో కోపం ఉండొచ్చు. కానీ తెలంగాణ ప్రజల మీద ప్రదర్శించకండి.. రాష్ట్రానికి నష్టం చేకూరుతుంది అని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. గిగ్ వర్కర్ పాలసీ దేశంలోనే బెస్ట్ పాలసీ. రేపటి సమావేశంలో కొన్ని తీర్మానాలు భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా ఉన్నాయి. కాబట్టి భారత్ సమ్మిట్‌ను గుడ్డిగా వ్యతిరేకించొద్దు. రాహుల్ అంటే మీకు భయం ఉండొచ్చు. రాబోయే ఎన్నికల్లో మిమ్మల్ని ఓడిస్తాడు.. ప్రధానిగా బాధ్యత తీసుకుంటాడని భయం ఉండొచ్చు. ఆ భయంతో రాహుల్‌పై ఆరోపణలు చేయాలన్న ఆలోచన ఉంటే మానేయండి. రాష్ట్ర ప్రభుత్వం తరపున విజ్ఞప్తి చేస్తున్నా.. రాహుల్ ముఖ్య అతిథిగా తన అభిప్రాయాలను పంచుకోవడానికి, గిగ్ వర్కర్స్ పాలసీని అంకితం చేయడానికి వస్తున్నారు. ఇదే సందర్భంగా ఢిల్లీలో ఏర్పాటు చేసిన ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు పీయూష్ గోయల్ ముఖ్య అతిథిగా వచ్చారు. అక్కడ్నే మో మీరు సమర్థిస్తారు.. సేమ్ అదే భారత్ సమ్మిట్‌కు రాహుల్ వస్తే వ్యతిరేకిస్తారు. ఈ ద్వంద్వ వైఖరిని బీజేపీ వీడాలి అని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.



అండాల అక్రమ దందా

- సద్గురు హెల్త్‌కేర్ సెంటర్ నిర్వాహకుల అరెస్టు
- రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు వెల్లడి

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

నగరంలో సంచలనం సృష్టించిన అక్రమ అండాల సేకరణ కేసులో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పుల్ల శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు మలక్‌పేటలోని ' సద్గురు హెల్త్‌కేర్ సర్వీసెస్ ప్రై.లి. నిర్వాహకులు డాక్టర్ దుర్గారావుతో పాటు అమిత్‌శర్మ, నిఖత్ పర్వీన్, దీపిక, డైరెక్టర్లను అరెస్టు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా అండాల సేకరణకు ఆరు సెంటర్లను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. కాగా, రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు వెల్లడయ్యాయి. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నిరుపేద యువతులను, మహిళలను పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేష్, బీహార్, మహారాష్ట్ర వంటి ఇతర రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు తరలించి మలక్‌పేటలోని సదరు కేంద్రం ద్వారా అండాలను సేకరించినట్టు వాంగ్మూలం నమోదు చేశారు. అక్రమంగా అండాలను సేకరించేందుకు ప్రవీణ్ అనే నిందితుడు వందకు పైగా నకిలీ ఆధార్ కార్డులను, పుట్టినతేదీ పత్రాలను సృష్టించినట్టు పేర్కొన్నారు. పరిమితికి మించి ఎక్కువ అండాలు రావడం కోసం మహిళలకు సరైన వైద్య పర్యవేక్షణ లేకుండానే ప్రమాదకరమైన హార్మోన్ ఇంజెక్షన్లు, మందులు వాడినట్టు ఆధారాలు కోర్టుకు సమర్పించారు. ఇండోర్‌కు చెందిన అమిత్‌శర్మ ప్రధాన సూత్రధారిగా ఈ దందాను నడిపించి కోట్ల రూపాయలు దండుకుని అక్రమ వ్యాపారం చేసినట్టు తేలింది. ఈ దందా నడుపుతున్న అమిత్‌శర్మ, నిఖత్ పర్వీన్, ఏజెంట్లు రేష్మాఖాతూన్, పంకజ్‌సోనీ, ఎమిరిశెట్టి దుర్గాప్రసాద్, ప్రవీణ్, విజయ్ భగవాన్‌రావు సాలుంకే, దీపికలను అరెస్టు చేశారు.

భారత్ సమ్మిట్‌లో దేశ వ్యతిరేక శక్తులు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్ ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ సమావేశాన్ని నిర్వహిస్తుండగా, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాత్రం ఈ కార్యక్రమంపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. తెలంగాణ అభివృద్ధి పేరుతో విదేశీ శక్తులతో కలిసి భారత్ సమ్మిట్ నిర్వహించడం సిగ్గుచేటని ఆయన మండిపడ్డారు. ఈ సమావేశం దేశ అభివృద్ధికి ఉపయోగపడే వేదిక కాదని, భారతదేశ విధానాలను వ్యతిరేకించే శక్తులు ఒకచోట చేరే వేదికగా మారిందని ఆరోపించారు. భారత్‌లో ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేందుకు అంతర్జాతీయ స్థాయిలో రాజకీయ కుట్రలు జరుగుతున్నాయని, అలాంటి ప్రయత్నాలకు కాంగ్రెస్ ప్రభుత్వం వేదిక కల్పిస్తోందని బండి సంజయ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సుమారు 70 దేశాల నుంచి ప్రతినిధులు పాల్గొంటున్న ఈ సమావేశంలో ఎక్కువమంది భారత విధానాలను వ్యతిరేకించే వ్యక్తులేనని ఆయన ఆరోపించడం రాజకీయంగా మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ముఖ్యంగా ఈ సమ్మిట్ నిర్వహణ వెనుక ఉన్న అసలు ఉద్దేశం, దానికి అవుతున్న ఖర్చులపై బండి సంజయ్ పలు కీలక ప్రశ్నలు లేవనెత్తారు. అంతర్జాతీయ సమావేశం పేరుతో ప్రజాధనాన్ని ఎంత ఖర్చు చేస్తున్నారో ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. మొత్తం నిర్వహణ వ్యయంలో ప్రభుత్వ ఖజానా నుంచి ఎంత వెచ్చిస్తున్నారు, ఈ సమావేశంలో చర్చించబోయే అంశాలు భారత విదేశాంగ విధానానికి అనుగుణంగా ఉన్నాయా అనే విషయాలను ప్రజలకు వివరించాలని అన్నారు. భారతదేశ అంతర్గత రాజకీయ వ్యవహారాలపై విదేశీ ప్రతినిధులతో చర్చించే అధికారం కాంగ్రెస్ పార్టీకి ఎవరిచ్చారని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ రాజకీయ ఆలోచనలకు అంతర్జాతీయ ప్రచారం కల్పించడమే ఈ సమావేశం వెనుక ఉన్న లక్ష్యమని ఆయన ఆరోపించారు. అంతర్జాతీయ వేదికను ఉపయోగించుకొని కాంగ్రెస్ తన రాజకీయ సిద్ధాంతాలను ప్రపంచ దేశాలకు పర

నా మొబైల్‌ను ట్యాప్ చేస్తున్నారు



మొదటిపేజీ తరువాయి

తన ఆరోపణలకు సంబంధించిన ఆధారాల గురించి ప్రస్తావించినప్పుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు మరో వివాదానికి దారితీశాయి. కాంగ్రెస్ విడుదల చేసిన వీడియోలో ఆయన తన మొబైల్ ఫోన్‌ను చూపిస్తూ కీలకమైన ఆధారాలన్నీ అందులోనే ఉన్నాయని చెప్పారు. తన ఫోన్‌ను ట్యాప్ చేస్తున్నారని, అందువల్ల అందులో ఏముందో ప్రధాని మోదీకి కూడా తెలుసని ఆరోపించారు. ముఖాముఖి చర్చ ప్రారంభమైతే విదేశీ శక్తుల ప్రభావంలో ఉన్న వ్యక్తుల పేర్లు బయటపడతాయని పేర్కొన్నారు. దేశద్రోహి ఎవరు, విదేశీ నియంత్రణ ఎప్పటి నుంచి కొనసాగుతోంది వంటి అంశాలను ప్రజల ముందుకు తీసుకొస్తానని ప్రకటించారు. గతంలో కూడా మోదీ ప్రధాని కావడానికి, అధికారంలో కొనసాగడానికి విదేశీ మద్దతు ఉందని రాహుల్ ఆరోపించారు. భారత ఆర్థిక వ్యవస్థపై విదేశీ శక్తుల ప్రభావం ఉందనే వ్యాఖ్యలు కూడా చేశారు. అయితే ఫోన్‌లో ఉన్నట్లు చెబుతున్న ఆధారాలను ఆయన బహిరంగంగా ప్రదర్శించలేదు. దీంతో ఆయన చేసిన సవాల్ రాజకీయంగా మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. పార్లమెంటులోనే చర్చించకుండా బయట డిబేట్ కోసం ఎందుకు పట్టుబడుతున్నారనే అంశంపైనా రాహుల్ గాంధీ వివరణ ఇచ్చారు. ఇన్‌స్టాగ్రామ్‌లో నిర్వహించిన ఆస్క్ మీ సెషన్‌లో నెటిజన్ అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ సభలో తనకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని విమర్శించారు. ఈ విషయాన్ని పీటీఐ వార్తా సంస్థ వెల్లడించింది. వ్యవసాయ చట్టాలు, ఓట్ల చోరీ ఆరోపణలు, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, చైనా వ్యవహారం వంటి అంశాలను పార్లమెంటులో ప్రస్తావించేందుకు ప్రయత్నించినట్లు చెప్పారు. మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ నరవణే పుస్తకం, ఎప్‌స్టీన్ అంశాలపై కూడా మాట్లాడనివ్వలేదని ఆరోపించారు. అందుకే ప్రజల ముందే ప్రధాని మోదీతో ముఖాముఖి చర్చ జరగాలని కోరుతున్నట్లు వివరించారు. సుదీర్ఘ ప్రసంగాల కంటే నేరుగా ప్రశ్నలు, సమాధానాలతో కూడిన డిబేట్ అవసరమని అభిప్రాయపడ్డారు. పార్లమెంటులో ప్రతిపక్షానికి తగిన అవకాశం ఇవ్వాలనే అంశం కూడా ఈ వివాదంతో మరోసారి చర్చనీయాంశమైంది. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలు కూడా రాజకీయ వాతావరణాన్ని మరింత వేడెక్కించాయి. బస్తర్‌లో సీఆర్‌పీఎఫ్ జవాన్లతో జరిగిన సమావేశంలో ఆయన నక్సలిజంపై దేశం సాధించిన విజయాలను ప్రస్తావించారు. దశాబ్దాలుగా సాగిన పోరాటంలో భద్రతా బలగాల కృషి కీలకమని పేర్కొన్నారు. అయితే రాజకీయ పార్టీలు, వివిధ సంస్థల్లోకి దిమాగీ నక్సల్స్ చొరబడ్డారంటూ విమర్శలు చేశారు. అంతకుముందు కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా రాహుల్ గాంధీపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పార్లమెంటులో చర్చలకు రాహుల్ దూరంగా ఉంటున్నారని ఆరోపించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. అక్టోబర్ 30న బీజేపీ కార్యకర్తల సమావేశంలో అమిత్ షా మాట్లాడుతూ రాహుల్ రాజ్యాంగ ప్రతిని చేతిలో పట్టుకుని తిరుగుతారని, కానీ దాని విలువలను గౌరవించడం లేదని విమర్శించారు. దీంతో రెండు పార్టీల మధ్య రాజకీయ విమర్శలు మరింత తీవ్రమయ్యాయి. మొత్తం రాజకీయ వివాదానికి ప్రధాన కారణాల్లో ఓట్ల చోరీ ఆరోపణలు, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అంశాలు ఉన్నాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై విపక్షాలు చేస్తున్న విమర్శలను బీజేపీ తీవ్రంగా తప్పుబట్టింది. ఎన్నికల వ్యవస్థపై అనవసర అనుమానాలు సృష్టిస్తున్నారంటూ అధికార పార్టీ నేతలు ఆరోపించారు. అదే సమయంలో ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత ఉండాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. ఈ పరిణామాల మధ్య రాహుల్ గాంధీ ప్రధానికి నేరుగా చర్చకు రావాలని సవాల్ విసరడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఒకవైపు పార్లమెంటులో చర్చకు సిద్ధమని ప్రభుత్వం చెబుతుండగా, మరోవైపు ప్రజల సమక్షంలో డిబేట్ జరగాలని ప్రతిపక్షనేత కోరుతున్నారు. దీంతో చర్చ ఎక్కడ జరగాలనే అంశమే కొత్త వివాదంగా మారింది. రాహుల్ చేసిన విదేశీ ప్రభావం, ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు కూడా రాజకీయ చర్చను మరింత విస్తరించాయి. ఈ పరిణామాలు రాబోయే రోజుల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య పోరును మరింత తీవ్రం చేసే అవకాశముంది.

అమ్మకాలకు కేరాఫ్ అడ్రస్‌గా రేవంత్

విశాలభారతి, స్టేట్ బ్యూరో:



భూమి సూర్యుడి చుట్టూ తిరిగిట్టు.. రేవంత్ రెడ్డి భూముల చుట్టే తిరుగుతున్నాడని బీఆర్ఎల్పీ ఉపనేత హరీశ్ రావు మండిపడ్డారు. ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చుని రియల్ ఎస్టేట్ దందా చేస్తున్నాడని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి రంగులు మార్చే తీరు చూసి ఊసరవెల్లి కూడా సిగ్గుపడి ఉరేసుకుంటుందన్నారు. నాడు బొందల గడ్డకు జాగా ఉండదని డైలాగులు కొట్టి.. నేడు కైతలాపూర్‌లో బొందల గడ్డను కూడా చదును చేస్తున్నారని విమర్శించారు. కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల్లో ఉన్న ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్, ఆర్టీఓ ఆఫీస్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, నర్సరీని కూడా అమ్మకానికి పెట్టడం సిగ్గుచేటని ఎద్దేవాచేశారు. బిడ్డా జాగ్రత్త.. రేపు వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే.. వేలంలో ఎవరు భూములు కొన్నా అనుమతులు ఇవ్వం, మళ్లీ వెనక్కి తీసుకుని ప్రజా అవసరాలకే వాడుతామంటూ హెచ్చరించారు. రాష్ట్రంలో లక్ష కోట్ల భూములు అమ్మకానికి పెట్టారని, ఇప్పటికే 26 వేల కోట్ల భూములు అమ్మేశారని చెప్పారు. కూకట్‌పల్లి ట్రక్ పార్క్ వేలంపై ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నిర్వహించిన ధర్నాలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజల జీవితాలను విధ్వంసం చేయడానికి తుఫాను, సునామీ, భూకంపాల వంటివి అక్కర్లేదని.. రేవంత్ రెడ్డి పాలన చాలన్నారు. ఎల్‌నినో కరువు కంటే కాంగ్రెస్ పాలనే ప్రమాదకరమని మండిపడ్డారు. `2013లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూములను అమ్మకానికి పెడితే.. నాడు ఎమ్మెల్యేగా ఉన్న మాధవరం కృష్ణారావు, సీపీఐ నారాయణ, సీపీఎం రాఘవులు, ఎంపీ వినోద్ కుమార్, తెలంగాణ ఉద్యమకారులందరం కలిసి ఇక్కడికి వచ్చి పెద్ద ఎత్తున పోరాటం చేశాం. నాడు బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎంల ఉమ్మడి పోరాటంతో కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తగ్గి ఈ భూమిని కాపాడుకోగలిగాం. ఆ తర్వాత కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నపదేండ్లలో ఈ ట్రక్ పార్క్ భూమిలో ఒక్క గజం కూడా అమ్మలేదు కదా, కనీసం అమ్మే ప్రయత్నం కూడా చేయలేదు. పైగా ప్రజా అవసరాల కోసం ఆలోచించి.. చెట్లు పెంచడానికి హెచ్‌ఎండీఏ నర్సరీకి, ఏసీపీ పోలీస్ స్టేషన్‌కు, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు, ఆర్టీఓ ఆఫీస్‌కు కొంత భూమిని ఇచ్చాం. ప్రజలకు అందుబాటులో ఉండేలా ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ కట్టించాం, ట్రక్ పార్కింగ్‌ను కొనసాగించాం. కానీ ఇవాళ 13 ఏండ్ల తర్వాత మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఈ భూమిని మొత్తానికి మొత్తం అమ్మకానికి పెట్టడం అత్యంత దురదృష్టకరం. ఈ నెల 27న వేలం వేసేందుకు నిన్న హెచ్‌ఎండీఏ నోటిఫికేషన్ ఇచ్చింది. మూసాపేటలోని సర్వే నంబర్లు 121/P నుంచి 141 వరకు, 146, 147, 155, 156, 157 లలో ఉన్న భూములను అమ్మకానికి పెట్టారు. ఎంత దుర్మార్గమంటే..సర్వే నంబర్ 155లో ఉన్న ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌ను, 156లో ఉన్న ట్రక్ పార్కింగ్‌ను, హెచ్‌ఎండీఏ నర్సరీని, ఆర్టీఓ ఆఫీస్‌ను, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు ఇచ్చిన జాగాను కూడా అమ్మేస్తారట.. అంటే రేవంత్ రెడ్డి ఇంకేమీ మిగిల్చే పరిస్థితి కనిపించడం లేదు. కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి.. ఈ మూడు నియోజకవర్గాల మధ్య ఉన్న ఒకే ఒక్క ఖాళీ స్థలం ఇది. ఈ ప్రాంతంలో ప్రస్తుతం 10 లక్షల మంది ప్రజలు నివసిస్తుంటే, రాబోయే నాలుగైదేళ్లలో మరో 10 లక్షల జనాభా పెరగబోతోంది. పక్కనే ఉన్న ఇండియన్ కంటైనర్ డిపో నుంచి రోజుకు 500 కంటైనర్లు లోడ్ అయి ఎక్స్‌పోర్ట్ అవుతుంటాయి. సిటీలోకి లారీలకు కేవలం 4 గంటలే ఎంట్రీ ఉంటుంది కాబట్టి పార్క్ చేసుకుని డ్రైవర్లు విశ్రాంతి తీసుకుంటారు. మరి ఈ స్థలాన్ని అమ్మేస్తే ఆ వందలాది లారీలు, కంటైనర్లు ఎక్కడ పెట్టుకోవాలి. సూర్యుడి చుట్టూ భూమి తిరిగినట్టు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతసేపూ భూముల చుట్టే తిరుగుతున్నాడు. ఏడ భూమి కనబడితే ఆడ అమ్మడే పనిగా పెట్టుకున్నాడు. చివరకు కాప్రాలో 484 గజాలు, అమీన్‌పూర్‌లో 302 గజాల స్థలాన్ని కూడా వేలానికి పెట్టారంటే ఎంత సిగ్గుచేటు! కాప్రాలో బస్తీ దవాఖానా కిరాయి బిల్డింగ్‌లో నడుస్తోంది, ఆ 484 గజాల్లో బస్తీ దవాఖానా కట్టొచ్చు కదా? 50 గజాలు, 100 గజాలు, 300 గజాలు కూడా వదలకుండా ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చుని రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ దందా చేస్తున్నాడు. భూముల వేలంపై రేవంత్ రెడ్డి మాటలు చూస్తే ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతుంది..అయ్యో.. నాకంటే స్పీడ్‌గా ఈయన రంగులు మారుస్తున్నాడే అని ఊసరవెల్లి కూడా ఉరేసుకుంటుందేమో..నాడు పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఇదే రేవంత్ రెడ్డి..ప్రభుత్వ భూములు అంటే పెద్దలు ఇచ్చిన ఆస్తి, జాతి సంపద.. ఆ భూములు అమ్మితే బొందలు పెట్టడానికి శ్మశానవాటికకు, దవాఖానాలకు, కాలేజీలకు, స్కూళ్లకు కూడా జాగా ఉండదు అని మాట్లాడాడు. మరి ఇవాళ ఏం చేస్తున్నాడు? ఇదే కూకట్‌పల్లి నియోజకవర్గం కైతలాపూర్‌లో నిన్న శ్మశానవాటిక కూడా లెవెల్ చేసేశారు, దాన్ని కూడా అమ్మేస్తారేమో..ఎన్నికల ముందు మేము అధికారంలోకి వస్తే ఇంచు భూమి కూడా అమ్మబోమని వాగ్దానం చేసి.. ఇవాళ ఇంచు భూమి కూడా మిగల్చకుండా అమ్ముతున్నాడు. హౌసింగ్ బోర్డు భూములు, రాజీవ్ స్వగృహ భూములు, టీజీఐఐసీ భూములు, హెచ్‌ఎండీఏ భూములు, కుడా భూములు, దళిత గిరిజనుల అసైన్డ్ భూములు, సెంట్రల్ యూనివర్సిటీ భూములు, ఉర్దూ యూనివర్సిటీ భూములు, ఇండస్ట్రియల్ భూములు, హెరిటేజ్ భూములు, ఎన్విరాన్‌మెంటల్ భూములు.. చివరకు ఎవాక్యూ ప్రాపర్టీలను కూడా రాత్రికి రాత్రే ప్రైవేట్ ఆస్తులుగా మార్చి అమ్మేస్తున్నారు. ఇవాళ అమ్మకాలకు కేరాఫ్ అడ్రస్‌గా రేవంత్ రెడ్డి మారిపోయాడు. 1982 జూలై 5న ఆనాటి హుడా తరఫున ఆర్టీఓ ఈ కూకట్‌పల్లి, మూసాపేట భూములను ఎస్సీ, ఎస్టీ, పేద రైతుల నుంచి ఎకరాకు లక్ష, లక్షా ఇరవై వేలు ఇచ్చి సేకరించారు. ఆనాటి భూసేకరణ చట్టం ఆర్డర్‌లోనే.. ఈ భూమిలో ఎలాంటి ఇండ్లు కట్టడానికి గానీ, వ్యాపారం చేయడానికి గానీ వీల్లేదు.. కేవలం ప్రజా ప్రయోజనాలకు మాత్రమే వాడాలి అని స్పష్టంగా రాశారు. అంతేకాదు, ఈ భూమిని ట్రక్ పార్కింగ్, ప్రజా ప్రయోజనాల కోసమే వాడుతామని ఇదే అధికారులు హైకోర్టు, సుప్రీంకోర్టులో అఫిడవిట్లు దాఖలు చేశారు. మరి ఇవాళ ఎకరం రూ. 100 కోట్లకు అమ్ముతామంటున్నారే.. కొన్నవాడు ఇక్కడ ఇండ్లు కట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారమే కదా చేసేది? మీ హెచ్‌ఎండీఏ చట్టానికే విరుద్ధంగా ఎలా అమ్ముతారు?. ఒకవేళ ఈ భూమిని ప్రజా అవసరాలకు వాడకపోతే.. ఆనాడు భూములిచ్చిన పేద ఎస్సీ, ఎస్టీ రైతులకైనా తిరిగి ఇచ్చేయండి.

500 ఉన్నత పాఠశాలల్లో 11, 12వ తరగతులు

హైదరాబాద్, :

ఇంటర్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో.. ఆ దిశగా ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. పాఠశాల విద్య పూర్తయ్యాక ఇంటర్ కాలేజీలు దూరంగా ఉండటం కూడా డ్రాపవుట్లకు ప్రధాన కారణమని విద్యాశాఖ జరిపిన సర్వేలో తేలింది. ఈ నేపథ్యంలో కాలేజీలు దూరంగా ఉన్న కనీసం 500 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో వచ్చే విద్యాసంవత్సరం నుంచి తప్పనిసరిగా 12వ తరగతి ప్రారంభించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో శుక్రవారం విద్యాశాఖ సలహాదారు కే.కేశవరావు విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, ఇంటర్ విద్య, పాఠశాల విద్య కార్యదర్శులు అఖిలాష, నవీన్ నికోలస్‌తో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో పెద్దసంఖ్యలో ఉన్న ఉన్నత పాఠశాలను 12వ తరగతి వరకు ఎలా కొనసాగించాలన్న అంశంపైనే ప్రధానంగా చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మోడల్ స్కూళ్లు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఇప్పటికే 12వ తరగతి వరకు విద్య కొనసాగుతోంది. దీంతో అవి యథావిధిగా కొనసాగుతాయి. ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల అంశంపైనే చర్చలు సాగుతున్నాయి. రాష్ట్రంలో మొత్తం 430 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉండగా.. అందులో 96 కాలేజీలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల క్యాంప్‌సలోనే కొనసాగనున్నాయి. 260 కాలేజీలు ఉన్నత పాఠశాలలకు 1 కి.మీ. పరిధిలో ఉన్నాయి. ఇక్కడ కూడా ఇబ్బంది లేదు. ఈ రెండు చోట్ల ఉన్న కాలేజీలు వచ్చే ఏడాది నుంచి హయ్యర్ సెకండరీ స్కూళ్లుగా మారనున్నాయి. ఇతర కాలేజీల విషయంలోనూ త్వరలో స్పష్టత రానుంది. పాఠశాల విద్య, ఇంటర్ విద్యకు ప్రస్తుతం ఉన్న ఇద్దరు కార్యదర్శుల స్థానంలో విలీనం తర్వాత ఒక్కరే ఉంటారు. అయితే 10, 12వ తరగతి బోర్డు పరీక్షల నిర్వహణ కోసం పదోతరగతి, ఇంటర్ బోర్డులు యథావిధిగా కొనసాగనున్నాయి. ఇంటర్ బోర్డు (టీజీబీఐఈ) స్వతంత్ర సంస్థగా ఉంది. దీనికి ముఖ్యమంత్రి చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఇంటర్ పరీక్షల విధివిధానాలు, పరీక్షల నిర్వహణ, కాలేజీలకు అనుబంధ గుర్తింపులను బోర్డు చూస్తోంది. వచ్చే ఏడాది నుంచి ఇంటర్ విద్య పాఠశాల విద్యలో విలీనం అయ్యాక స్వల్ప మార్పులతో ఇదే విధానంలో బోర్డును కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇంటర్ బోర్డులో మొత్తం 255 మంది ఉద్యోగులు ఉన్నారు. వీరిలో 145 మంది మాత్రమే శాశ్వత ఉద్యోగులు. వీరి సీనియారిటీ, పదోన్నతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని ప్రభుత్వం భావిస్తోంది.



గ్యాస్ సిలిండర్ల బ్లాక్ దందా!

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

గ్రేటర్ పరిధిలో గ్యాస్ సిలిండర్ల బ్లాక్ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతున్నది. వంట గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారులకు అందించాల్సిన డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌కు యథేచ్ఛగా సరఫరా చేస్తున్నాయి. 14కేజీల డొమెస్టిక్ వంట గ్యాస్ ప్రభుత్వ ధర రూ.990గా ఉంది. దీన్ని వ్యాపారులు బ్లాక్‌లో రూ.2,500పైగా అమ్ముతున్నారు. గ్యాస్ ఏజెన్సీలు బహిరంగంగానే సరఫరా చేస్తున్నట్లు వ్యాపారులే స్వయంగా చెప్తున్నారు. ఈ దందా బహిరంగంగా కొనసాగుతున్నా పౌర సరఫరాల అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడటం లేదు. నిత్యం వేలాది సిలిండర్లు బ్లాక్ మార్కెట్‌కు చేరుతున్నా ఎక్కడా తనిఖీలు చేసిన దాఖలాలు కనిపించడం లేదు. దీంతో ఏజెన్సీలో గ్యాస్ కనెక్షన్లు కలిగి ఉన్న అసలైన వినియోగదారులకు అందాల్సిన సిలిండర్లు పక్కదారి పడుతున్నాయి. ఈ వ్యవహారంలో పౌర సరఫరాల అధికారుల హస్తం ఉన్నందువల్లనే తనిఖీలు చేపట్టకుండా మౌనంగా ఉంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఒక్కో ఏజెన్సీ నుంచి పౌరసరఫరాల అధికారులకు ప్రతినెలా రూ.లక్షల్లో మామూళ్లు వెళ్తున్నాయనే చర్చ జరుగుతున్నది. గ్యాస్ సిలిండర్ల అక్రమ దందా గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో జోరుగా సాగుతున్నది. ఏజెన్సీలు కనెక్షన్ ఉన్న వినియోగదారులకు సరఫరా చేసే వాహనాల్లోనే వ్యాపారులకు కూడా సరఫరా చేస్తున్నారు. రూ.990 డొమెస్టిక్ సిలిండర్‌ను వ్యాపారులకు రూ.1,500 నుంచి రూ.2,000 ధర ఫిక్స్ చేసి సరఫరా చేస్తున్నారు. అనంతరం వ్యాపారులు ఒక్కో డొమెస్టిక్ సిలిండర్‌ను రూ.2,400 నుంచి రూ.2,500 ఆపై ధరకు పెంచి అమ్ముతున్నారు. ఈ దందాకు సిటీలోని అన్ని ఏజెన్సీలు సహకరిస్తున్నట్లు తెలుస్తున్నది. గ్యాస్ సిలిండర్లు అక్రమంగా విక్రయిస్తుండటంతో వినియోగదారులకు సరైన సమయంలో గ్యాస్ సిలిండర్ ఇంటికి చేరడం లేదు. బుక్ చేసుకున్నవారికి చేరాల్సిన గ్యాస్ సిలిండర్‌ను సంబంధిత చిరునామాకు చేరవేయకుండానే వినియోగదారుడు అందుబాటులో లేరనే మెసేజ్‌లు పంపిస్తున్నారు. దాన్ని బ్లాక్ వ్యాపారులకు మళ్లిస్తున్నట్లు తెలుస్తున్నది. అదే విధంగా మరికొన్ని ప్రాంతాల్లో బుక్ చేసుకుని 10 రోజులు దాటినా వినియోగదారులకు గ్యాస్‌బండ చేరడంలేదు.

హైదరాబాద్‌లో 2 రోజుల భారత్ సమ్మిట్



మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వ ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. భారత్ సమ్మిట్‌లో అత్యంత కీలకమైన ఘట్టంగా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రసంగం నిలవనుంది. నవంబర్ 14న జరిగే ముగింపు సమావేశంలో ఆయన ప్రపంచ రాజకీయాలు, భారత భవిష్యత్తుపై తన దృక్పథాన్ని వివరించనున్నారు. ముఖ్యంగా ప్రజాస్వామ్య విలువలు, అంతర్జాతీయ సహకారం, శాంతియుత సహజీవనం, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి వంటి అంశాలను ప్రస్తావించే అవకాశముంది. ప్రపంచ దేశాలతో సంబంధాలు కొనసాగిస్తూనే స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే విదేశాంగ విధానంపై ఆయన మాట్లాడనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు భారత్ సమ్మిట్ నిర్వహణ తెలంగాణ రాజకీయాల్లో కొత్త వివాదానికి దారితీసింది. ఈ కార్యక్రమాన్ని బీజేపీ భారత్ వ్యతిరేక సదస్సుగా అభివర్ణిస్తూ తీవ్ర విమర్శలు చేస్తోంది. అంతర్జాతీయ సమావేశాల పేరుతో ప్రజాధనాన్ని ఖర్చు చేయడం ఎంతవరకు సమంజసమనే అంశాన్ని ప్రశ్నిస్తోంది. ముఖ్యంగా సదస్సు రాజకీయ లక్ష్యాలు, ప్రభుత్వ పాత్రపై బీజేపీ అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. ఇదే సమయంలో సమావేశానికి రావాల్సిన కొందరు విదేశీ ప్రతినిధులకు వీసాల రద్దు, భారత్‌లో ప్రవేశానికి ఆంక్షలు ఎదురైనట్లు కథనాలు వెలువడటం చర్చనీయాంశమైంది. ఈ నిపుణులు మాట్లాడనున్నారు. క్లౌడ్ క్యాపిటలిజం, కొత్త ప్రపంచ రాజకీయ క్రమం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ప్రత్యామ్నాయ విధానాలు, యువత రాజకీయ భాగస్వామ్యం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. వాతావరణ మార్పులు, మహిళా సాధికారత, లింగ సమానత్వం, మీడియా భవిష్యత్తు, ప్రజాస్వామ్య జవాబుదారీతనం కూడా చర్చల్లో భాగం కానున్నాయి. నెదర్లాండ్స్, పోర్చుగల్, ఇండోనేషియా, ఐవరీ కోస్ట్, దక్షిణ కొరియా, బ్రెజిల్, జపాన్, థాయ్‌లాండ్, అమెరికా, యూరోపియన్ యూనియన్ నుంచి ప్రముఖులు పాల్గొననున్నారు. ఐవరీ కోస్ట్‌కు చెందిన పాస్కల్ అఫీ ఎన్‌గెస్సాన్ కూడా హాజరయ్యే ప్రతినిధుల్లో ఉన్నారు. దక్షిణ దేశాల మధ్య సహకారం, అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు, భవిష్యత్తు ఆర్థిక అవకాశాలపై ఈ సమావేశాలు దృష్టిపెట్టనున్నాయి. అంతర్జాతీయ అంశాలతో పాటు తెలంగాణ అభివృద్ధికి కూడా భారత్ సమ్మిట్‌లో ప్రత్యేక ప్రాధాన్యం కల్పించారు. తెలంగాణ రైజింగ్ పేరుతో మొత్తం తొమ్మిది ప్రత్యేక సెషన్లు నిర్వహించనున్నారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణం, ఆధునిక పట్టణీకరణ, ఆర్థిక న్యాయం, సామాజిక సంక్షేమం, సహకార సమాఖ్య విధానం వంటి అంశాలపై చర్చలు జరగనున్నాయి. యువత, క్రీడలు, సంస్కృతి, రాజకీయాలు, ఎన్నికల పారదర్శకత కూడా ఈ సమావేశాల్లో ప్రధాన అంశాలుగా ఉండనున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఈ సెషన్లలో పాల్గొననున్నారు. అలాగే మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజారుద్దీన్ కూడా చర్చల్లో భాగం కానున్నారు. తెలంగాణ అభివృద్ధి ప్రణాళికలను అంతర్జాతీయ ప్రతినిధుల ముందు ఉంచడంతో పాటు ప్రపంచ దేశాల్లో అమలవుతున్న విజయవంతమైన విధానాలను తెలుసుకోవడం ఈ సమావేశాల ద్వారా సాధ్యమవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు భారత్ సమ్మిట్ నిర్వహణ తెలంగాణ రాజకీయాల్లో కొత్త వివాదానికి దారితీసింది. ఈ కార్యక్రమాన్ని బీజేపీ భారత్ వ్యతిరేక సదస్సుగా అభివర్ణిస్తూ తీవ్ర విమర్శలు చేస్తోంది. అంతర్జాతీయ సమావేశాల పేరుతో ప్రజాధనాన్ని ఖర్చు చేయడం ఎంతవరకు సమంజసమనే అంశాన్ని ప్రశ్నిస్తోంది. ముఖ్యంగా సదస్సు రాజకీయ లక్ష్యాలు, ప్రభుత్వ పాత్రపై బీజేపీ అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. ఇదే సమయంలో సమావేశానికి రావాల్సిన కొందరు విదేశీ ప్రతినిధులకు వీసాల రద్దు, భారత్‌లో ప్రవేశానికి ఆంక్షలు ఎదురైనట్లు కథనాలు వెలువడటం చర్చనీయాంశమైంది. ఈ పరిణామాల మధ్య తెలంగాణ ప్రభుత్వం మాత్రం హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి చర్చలకు వేదికగా నిలబెట్టే ప్రయత్నం చేస్తోంది. ప్రజాస్వామ్యం, ఆర్థిక సమానత్వం, అంతర్జాతీయ భాగస్వామ్యం వంటి అంశాలపై జరిగే చర్చలు సదస్సు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. రాజకీయ విమర్శల నడుమ రెండు రోజుల సమావేశాలు ఎలాంటి నిర్ణయాలకు దారితీస్తాయనేది ఆసక్తికరంగా మారింది. ప్రభుత్వ ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. భారత్ సమ్మిట్‌లో అత్యంత కీలకమైన ఘట్టంగా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రసంగం నిలవనుంది. నవంబర్ 14న జరిగే ముగింపు సమావేశంలో ఆయన ప్రపంచ రాజకీయాలు, భారత భవిష్యత్తుపై తన దృక్పథాన్ని వివరించనున్నారు. ముఖ్యంగా ప్రజాస్వామ్య విలువలు, అంతర్జాతీయ సహకారం, శాంతియుత సహజీవనం, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి వంటి అంశాలను ప్రస్తావించే అవకాశముంది. ప్రపంచ దేశాలతో సంబంధాలు కొనసాగిస్తూనే స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే విదేశాంగ విధానంపై ఆయన మాట్లాడనున్నట్లు తెలుస్తోంది.

సిగ్గులేకుండా రాష్ట్రానికి వస్తున్నావా?

మొదటిపేజీ తరువాయి





రాజకీయ పర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. రాహుల్ గాంధీ తెలంగాణకు రావడాన్ని కేటీఆర్ తప్పుబట్టడం కంటే, ఆయన పర్యటన వెనుక ఉన్న ఖర్చు, ప్రభుత్వ ప్రాధాన్యతలు, గతంలో రాష్ట్రంలో చోటుచేసుకున్న పరిణామాలపై ఆయన మౌనంగా ఉండటాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన సమయంలో స్పందించకుండా, ఇప్పుడు ప్రచార కార్యక్రమాల కోసం రాష్ట్రానికి రావడం ఎంతవరకు సమంజసమనే అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారు. ముఖ్యంగా ఈ పర్యటన కోసం ప్రజాధనం రూ.100 కోట్లు ఖర్చు చేస్తున్నారంటూ కేటీఆర్ చేసిన ఆరోపణ రాజకీయ చర్చకు మరింత ఆజ్యం పోసింది. దీంతో రాహుల్ పర్యటన రాజకీయంగా కాంగ్రెస్‌కు ఎంతవరకు ఉపయోగపడుతుందనే దానికంటే, ఆ

కొమ్మాలు నాయక్‌కు సారీ ఫంక్షన్ ఆహ్వానం



గూడూరు,విశాల భారతి: గూడూరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని గూడూరు గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు మండల సుధాకర్ కుమార్తెల సారీ ఫంక్షన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గూడూరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మాలు నాయక్ ముఖ్య అతిథిగా హాజరై వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్ రెడ్డి, ఉప సర్పంచ్ చంటి స్వామి, వార్డు సభ్యులు గార్లపాటి శిరీష రాజేష్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శివరాత్రి శ్రీను, పంజరబోయిన శ్రీను తదితరులు పాల్గొని వేడుకలను సందడిగా నిర్వహించారు.

గిరిజన జర్నలిస్టుల హక్కుల కోసం ఐక్య పోరాటం సాగించాలి

- జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- ఇళ్లు, ఆరోగ్య భద్రత, పిల్లలకు ఉచిత విద్య కల్పించాలి: మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ డిమాండ్



మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్: ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన జర్నలిజంలో కీలక పాత్ర పోషిస్తున్న గిరిజన జర్నలిస్టుల హక్కులను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా పోరాడాలని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ పిలుపునిచ్చారు. జర్నలిస్టులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి, వారి సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ పట్టణంలోని లయన్స్ క్లబ్ సమావేశ మందిరంలో శుక్రవారం తెలంగాణ ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ మహబూబాబాద్ జిల్లా రెండవ మహాసభలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సమాజానికి, ప్రభుత్వాలకు తెలియజేస్తూ గిరిజన జర్నలిస్టులు నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తున్నారని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో గిరిజన జర్నలిస్టులు తమ కలం ద్వారా ప్రజల్లో చైతన్యం నింపి ఉద్యమానికి విశేషంగా అండగా నిలిచారని గుర్తుచేశారు. ఎన్నో ఒడిదుడుకులు, ఒత్తిళ్లు ఎదుర్కొంటూ వృత్తిపట్ల అంకితభావంతో పనిచేస్తున్న జర్నలిస్టులకు సమాజం అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిస్టులకు సొంత ఇళ్లు కల్పించడంతో పాటు మెరుగైన ఆరోగ్య భద్రత, వారి పిల్లలకు ఉచిత నాణ్యమైన పాఠశాల విద్య అందించాలని డిమాండ్ చేశారు. వృత్తి నిర్వహణలో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించేందుకు ప్రత్యేక సంక్షేమ చర్యలు చేపట్టాలని, జర్నలిస్టుల కుటుంబాలకు భరోసా కల్పించాలని అన్నారు. గిరిజన జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన, వృత్తిపరమైన భద్రత కోసం సంఘం మరింత బలోపేతం కావాలని, ఐక్యతతో హక్కుల సాధన దిశగా భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవాలని సత్యవతి రాథోడ్ సూచించారు. జర్నలిస్టుల సంక్షేమం, గౌరవప్రదమైన జీవనం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదంలో మరణించిన కుటుంబానికి మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ పరామర్శ



మరిపెడ విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్: మరిపెడ మండలం లచ్యతండాలో విషాదం నెలకొంది. రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు బాణోత్ సామా, పద్మ మృతి చెందడంతో వారి కుటుంబం తీవ్ర దుఃఖంలో మునిగిపోయింది. ఈ నేపథ్యంలో శుక్రవారం మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ లచ్యతండాలోని బాధిత కుటుంబం నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. దంపతుల మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ, వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఐలి నరహరి గౌడ్, బోడ్ శ్రీను నాయక్, బాదే నాగయ్య తదితరులు పాల్గొన్నారు.


నాగుల చవితి పర్వదినం.. భక్తిశ్రద్ధలతో నాగేంద్రుడి ఆరాధన



అడవిదేవులపల్లి విశాలభారతి: హిందూ సంప్రదాయంలో విశిష్టమైన నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు నాగేంద్రుడిని భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. ఈ సందర్భంగా అడవిదేవులపల్లి గ్రామంలోని శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయం భక్తులకు అధిక సంఖ్యలో పాల్గొని నాగదేవతల అనుగ్రహంతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆలయ ప్రధాన అర్చకులు వెల్లటూరి రామ్మోహన్ శర్మ పంచామృత అభిషేకాలు నిర్వహించారు అనంతరం భక్తులందరూ శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు ఈ కార్యక్రమంలో వేచూరి బ్రదర్స్ పసుపులేటి చెన్నకేశవులు జల్లే పుల్లారావు పంతంగి హరీష్‌రావు బలుసు అశోక్ గుండా సీతారామయ్య వెంపటి శీను గందె నాగేశ్వరరావు బండి అర్జునయ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శలతో ప్రజల మధ్య మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

- నూతన గృహప్రవేశ వేడుకలో పాల్గొని శుభాకాంక్షలు



కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్: డోర్నకల్ నియోజకవర్గంలో ప్రజలతో మమేకమవుతూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ శుక్రవారం కురవి మండలం సుదనపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో బాధపడుతున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దుస్స మల్సూర్‌ను వారి నివాసంలో పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇటీవల మృతి చెందిన నాగరబోయిన వీరన్న కుటుంబాన్ని పరామర్శించి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనారోగ్యంతో ఉన్నబైరి విజయను, ప్రమాదానికి గురైన మాజీ కురవి దేవస్థానం ధర్మకర్త కన్నెగంటి వెంకటరమణను వారి నివాసాల్లో పరామర్శించారు. అనంతరం గ్రామ పార్టీ ఉపాధ్యక్షుడు ఇరి సుధాకర్ నూతన గృహప్రవేశ వేడుకకు హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజకీయ ప్రత్యర్థిని ఎదుర్కోలేకపోతే రాజకీయాల నుంచి తప్పుకోవాలి

- హత్యా కుట్రలకు దిగితే సహించేది లేదు
- విమర్శలకు సమాధానం చెప్పలేక కక్ష సాధింపులకు దిగడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు
- తీన్మార్ మల్లన్న హత్య కుట్ర ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరపాలి: ఉపేందర్ వీరిశెట్టి

మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్.






రాజకీయాలు అంటే ప్రజల కోసం పోరాడే వేదికలు తప్ప.. ప్రత్యర్థుల ప్రాణాలు తీసే యుద్ధభూములు కావని ఉపేందర్ వీరిశెట్టి స్పష్టం చేశారు. రాజకీయాల్లో విమర్శలు ఎదుర్కొనే ధైర్యం ఉండాలని, విమర్శలకు సమాధానం చెప్పలేని వారు ప్రజాక్షేత్రంలో తమ వైఖరిని మార్చుకోవాలే తప్ప బెదిరింపులు, దాడులు, హత్యా కుట్రల వంటి దారుణాలకు పాల్పడకూడదని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తనపై హత్య కుట్ర జరిగిందని అనుమానిస్తూ సంబంధిత ఆధారాలను రాష్ట్ర డీజీపీకి అందజేసి విచారణ కోరిన నేపథ్యంలో ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం తేలికగా తీసుకోరాదన్నారు. ఈ ఆరోపణలపై సమగ్రంగా, నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి నిజానిజాలను ప్రజల ముందుంచాలని కోరారు. హత్య కుట్రకు పాల్పడినట్లు ఆధారాలతో నిర్ధారణ అయితే రాజకీయ పలుకుబడి, పదవులు, పలుకుబడి కలిగిన వ్యక్తుల అండదండలు ఏవీ అడ్డు రాకుండా బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయాల్లో ఎవరి అభిప్రాయాలు వారివి.. ఎవరి సిద్ధాంతాలు వారివి. ప్రజా సమస్యలపై ఒకరిని మరొకరు నిలదీయడం, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడం, విధానాలను విమర్శించడం ప్రజాస్వామ్యం కల్పించిన హక్కులు. ఆ విమర్శలకు వాస్తవాలతో సమాధానం చెప్పాలి. ప్రజల మధ్యకు వెళ్లి తమ వాదనను వినిపించాలి. అంతేగానీ ప్రత్యర్థిని భయపెట్టడం, గొంతు నొక్కడం, భౌతికంగా అంతమొందించాలని చూడటం రాజకీయ పోరాటం కాదు.. ప్రజాస్వామ్య విలువలపై దాడి అని వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో కత్తులకు కాదు.. కలాలకు, తుపాకులకు కాదు.. ప్రజల ఓట్లకు చోటుండాలి. ప్రత్యర్థి ఆలోచనలను సిద్ధాంతాలతో ఎదుర్కోవాలి. ప్రజల మద్దతుతో రాజకీయంగా ఓడించాలి. అంతేగానీ వ్యక్తిగత కక్షలను హత్యా కుట్రల స్థాయికి తీసుకెళ్లడం అత్యంత ప్రమాదకరమైన పరిణామమని పేర్కొన్నారు. పదవులు వస్తాయి.. పోతాయి. అధికారాలు మారుతాయి. కానీ ఒక మనిషి ప్రాణం తిరిగి రాదు. అందుకే రాజకీయ నాయకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. రాజకీయాల్లో ఆత్మవిమర్శ ఉండాలి.. హత్యా రాజకీయాలు ఉండకూడదు. ప్రత్యర్థిని ఓడించాలనే పట్టుదల ఉండాలి.. అంతమొందించాలనే దురాలోచన ఉండకూడదు. ప్రజాస్వామ్యంలో రాజకీయ ప్రత్యర్థికి సమాధానం బుల్లెట్‌తో కాదు.. బ్యాలెట్‌తో చెప్పాలి. రాజకీయ పోరాటానికి ప్రజల తీర్పే ఆయుధం కావాలి తప్ప ప్రాణాలు తీసే కుట్రలు కాదు అని ఉపేందర్ వీరిశెట్టి స్పష్టం చేశారు.

21 పేజీల కన్నీటి లేఖ.. చివరకు అనంతలోకాలకు యువతి!



- రెండేళ్ల ప్రేమకు పెళ్లి దగ్గరే కులం గోడ
- నమ్మిన వ్యక్తి నిరాకరణతో విషాదాంతం
- మరణంపై కుటుంబ సభ్యుల అనుమానాలు
- న్యాయం కోసం రోడ్డెక్కిన తల్లిదండ్రులు

మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్



రెండేళ్ల పాటు సాగిన ప్రేమబంధం పెళ్లి పీటల వరకు చేరుతుందని ఆశపడిన ఓ యువతి జీవితం అర్ధాంతరంగా ముగిసింది. కలిసి జీవితాన్ని నిర్మించుకోవాలని కన్న కలలు కుల గోడ దగ్గర కూలిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తూ 21 పేజీల లేఖ రాసి సుస్మిత (24) బలవన్మరణానికి పాల్పడిన ఘటన మహబూబాబాద్ మండలం నడివాడలో విషాదాన్ని నింపింది. ప్రేమ పేరుతో నమ్మించి, వివాహం విషయంలో వెనక్కి తగ్గిన యువకుడి వైఖరే ఈ దారుణానికి కారణమని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.నడివాడ గ్రామానికి చెందిన మునిగె కుమారస్వామి, సుకన్య దంపతుల పెద్ద కుమార్తె సుస్మిత డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగ సాధనలో ఉంది. ఎస్సై ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణకు హాజరవుతోంది. ఇదే గ్రామానికి చెందిన అనిల్‌తో రెండేళ్లుగా ప్రేమ సంబంధం కొనసాగుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వివాహం చేసుకోవాలని సుస్మిత కోరగా, కులాంతర వివాహానికి తన తల్లిదండ్రులు అంగీకరించడం లేదంటూ అనిల్ పెళ్లి విషయాన్ని వాయిదా వేస్తూ వచ్చాడని ఆరోపించారు. ఈ పరిణామాలతో తీవ్ర ఆవేదనకు గురైన సుస్మిత తన మనోవేదనను 21 పేజీల లేఖలో పొందుపరిచినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు.తనకు అన్యాయం చేసిన వారిని వదలొద్దంటూ తల్లిదండ్రులకు చివరి సందేశం ఇచ్చినట్లు తెలిపారు.

మరణంపై అనుమానాల మేఘం

సుస్మిత మరణం వెనుక అసలు కారణాలను పూర్తిస్థాయిలో వెలికితీయాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. అనిల్‌తో పాటు అతడి కుటుంబ సభ్యులు, స్నేహితుల పాత్రపై అనుమానాలు వ్యక్తం చేస్తూ, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమెను హత్య చేసి ఉంటారనే సందేహాన్ని వెలిబుచ్చారు. అయితే ఈ ఆరోపణలు ఇంకా నిర్ధారణ కాలేదు. ఘటనపై సమాచారం అందుకున్న మహబూబాబాద్ రూరల్ పోలీసులు అక్కడికి చేరుకుని 21 పేజీల లేఖను స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేపట్టారు.

అండర్ బ్రిడ్జి వద్ద ఆగ్రహ జ్వాలలు

కుమార్తెను కోల్పోయిన తల్లిదండ్రులు న్యాయం కోసం రోడ్డెక్కారు. తమ బిడ్డ మరణానికి బాధ్యులుగా భావిస్తున్న వారిని వదలకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని అండర్ బ్రిడ్జి వద్ద కుటుంబ సభ్యులు, బంధువులు ధర్నాకు దిగారు. అనిల్‌ను ఎన్‌కౌంటర్ చేయాలని, అతడి కుటుంబ సభ్యులు, స్నేహితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనతో అండర్ బ్రిడ్జి వద్ద ఉద్రిక్తత నెలకొని వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులను శాంతింపజేసేందుకు ప్రయత్నించారు.

ఒకవైపు కూతురిని కోల్పోయిన కుటుంబం. కన్నీరుమున్నీరవుతుండగా, మరోవైపు 21 పేజీల లేఖలోని అంశాలు, కుటుంబ సభ్యులు వ్యక్తం చేస్తున్న అనుమానాలు ఈ ఘటనపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. సమగ్ర దర్యాప్తు జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, బాధ్యులుగా తేలిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

ఇంటర్ విద్య విలీనంపై తొందరపాటు వద్దు

విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :

సీనియర్ సెకండరీ విధానం పేరుతో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేయాలనే ప్రభుత్వ ప్రతిపాదనపై తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒకటికి రెండుసార్లు ఆలోచించి, విద్యారంగ నిపుణుల అభిప్రాయాలు తీసుకున్న తర్వాతే సరైన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఈ అంశంపై ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించారు.

ముందుగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో వసతులు కల్పించాలి

ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కూడా పూర్తిస్థాయిలో లేవని రవీంద్ర చారి విమర్శించారు. సరైన బోధనా సిబ్బంది లేకపోవడం, పాఠశాలల్లో కనీసం మరుగుదొడ్ల వంటి సౌకర్యాలు కూడా అందుబాటులో లేకపోవడంతో తల్లిదండ్రులు, విద్యార్థులు ప్రభుత్వ విద్యావ్యవస్థపై నమ్మకం కోల్పోతున్నారని పేర్కొన్నారు. ముందుగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో అవసరమైన సదుపాయాలు కల్పించడంతో పాటు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అమలు చేయాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలను నియంత్రించాలని డిమాండ్ చేశారు.



విద్యావేత్తలు, ప్రొఫెసర్లతో ప్రత్యేక కమిటీ వేయాలి

ఇంటర్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేసే అంశంపై ఉన్నత విద్యావేత్తలు, ప్రొఫెసర్లు, మేధావులు, విద్యావ్యవస్థలో అనుభవం ఉన్న నిపుణులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. సీనియర్ సెకండరీ విద్యా విధానంపై సమగ్ర అధ్యయనం చేసి, సాధ్యాసాధ్యాలను పరిశీలించి నివేదిక సమర్పించిన తర్వాతే ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎలాంటి అధ్యయనం లేకుండా, విద్యావేత్తల సలహాలు, సూచనలు తీసుకోకుండా వచ్చే ఏడాది నుంచే అమలు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం సరైన విధానం కాదన్నారు.

పేద విద్యార్థులకు అన్యాయం చేయొద్దు

ప్రభుత్వ విద్యాసంస్థల పట్ల పాలకుల నిర్లక్ష్యమే విద్యార్థులు ప్రభుత్వ విద్యకు దూరమవడానికి, డ్రాపౌట్స్ పెరగడానికి ప్రధాన కారణమని విమర్శించారు. పదకొండో తరగతిలో బోర్డు పరీక్ష విధానం ప్రవేశపెట్టడం వల్లే విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయని భావించడం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే కమిటీ ఏర్పాటు చేసి సమగ్ర అధ్యయనం చేపట్టాలని, ఆ తర్వాతే ఇంటర్ విద్య విలీనంపై నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. తొందరపాటు నిర్ణయాలతో పేద విద్యార్థుల భవిష్యత్తుకు నష్టం కలిగించవద్దని ఆందోజు రవీంద్ర చారి హెచ్చరించారు.

కరువు కోరల్లో రైతులు.. అప్పుల ఊబిలో అన్నదాతలు!

- వ్యవసాయ రుణాల వడ్డీ మాఫీ చేసి రీషెడ్యూల్ చేయాలి
- మున్సిపాలిటీల్లోనూ కూలీలకు ఉపాధి పనులు కల్పించాలి
- సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి ప్రభుత్వానికి డిమాండ్



డోర్నకల్ విశాల భారతి: జిల్లా స్టాఫ్ రిపోర్టర్: తీవ్ర కరువు పరిస్థితులతో పంటలు పండక, పెట్టుబడులు చేతికందక అప్పుల భారంతో కొట్టుమిట్టాడుతున్నరైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు.సన్న, చిన్నకారు రైతులు తీసుకున్న వ్యవసాయ రుణాలపై వడ్డీని పూర్తిగా మాఫీ చేసి, రుణాలను రీషెడ్యూల్ చేయడంతో పాటు తక్షణమే కొత్త రుణాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. డోర్నకల్ మున్సిపాలిటీలోని అశోక్ భవన్‌లో జరిగిన సీపీఐ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కరువు దెబ్బకు వ్యవసాయ కూలీలకు పనులు లేక కుటుంబ పోషణ భారంగా మారిందని, గ్రామీణ ప్రాంతాలకే పరిమితం కాకుండా మున్సిపాలిటీల పరిధిలోనూ కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు.కరువు సహాయక చర్యలను తక్షణమే ప్రారంభించి రైతులు, కూలీలకు అండగా నిలవాలని స్పష్టం చేశారు.ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలకు తావులేకుండా లాటరీ పద్ధతిని అమలు చేయాలని, గత ప్రభుత్వ హయాం నుంచి పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన వృద్ధులకు చేయూత పథకం కింద వెంటనే వృద్ధాప్య పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు.ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ ప్రజల పక్షాన నిలబడటమే కమ్యూనిస్టు పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంతో పాటు సభ్యత్వాల పునరుద్ధరణ చేపట్టాలని, ప్రజలను సంఘటితం చేసి స్థానిక సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటాలు నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నెల్లూరు నాగేశ్వరరావు, మండల కార్యదర్శి తురక రమేష్, పట్టణ కార్యదర్శి ఎల్లాపుల నరసింహారావు, ప్రభాకర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

నాగులచవితి వేడుకల్లో భక్తిభావంతో పాల్గొన్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

- నాగేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు.. పుట్టకు పాలు పోసి మొక్కులు చెల్లింపు



కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్: నాగులచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ కురవి మండల కేంద్రంలోని నాగేంద్ర స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో నాగేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, పుట్టకు పాలు పోసి భక్తిప్రపత్తులతో మొక్కులు చెల్లించుకున్నారు. సాంప్రదాయ ఆచారాలకు అనుగుణంగా నాగులచవితి పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. పర్వదినం సందర్భంగా ఆలయ దర్శనం భక్తులకు ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో కురవి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బాధావత్ లక్ష్మీ రాజు నాయక్, ఐలి నరహరి గౌడ్, బాదే నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

నిర్మల గ్రామంలో ఘనంగా జన సురక్ష క్యాంప్

- బీమా, పెన్షన్ పథకాలపై ప్రజలకు అవగాహన



దేవరుప్పుల విశాల భారతి : మండలం నిర్మల గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ (టీజీబీ), విడ్స్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జన సురక్ష క్యాంప్‌ను విజయవంతంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సంధ్యారాణి అధ్యక్ష తన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్బీఐ డీజీఎం దేవ్ ప్రియ, ఏజీఎం రాములు, ఎస్‌బీఐ ఆర్ఎం సుబ్బారావు, టీజీబీ ఆర్ఎం ఉదయ్, ఎల్‌డీఎం ప్రతిభ, నాబార్డ్ డీడీఎం విజయ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత, ప్రమాద బీమా రక్షణ, వృద్ధాప్యంలో పెన్షన్ ప్రయోజనాలు అందించే విధానాన్ని వివరించారు. అర్హులైన వారు పథకాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో టీజీబీ సింగరాజుపల్లి బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్ నాయక్, యూబీఐ దేవరుప్పుల బ్రాంచ్ మేనేజర్, డీసీసీ మేనేజర్, విడ్స్ క్లస్టర్ కోఆర్డినేటర్ సంతోష్, కౌన్సిలర్లు రవివర్మ, స్వాతి, డీఆర్‌డీఏ ఏపీఎం, సీసీ, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని క్యాంప్‌ను విజయవంతం చేశారు.

యువత భవిష్యత్తుకు క్రీడలే బాట: సర్పంచ్ కుర్మే అన్నపూర్ణ మహేందర్

విశాల భారతి, బోథ్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడల్లో రాణించాలని బోథ్ సర్పంచ్ కుర్మే అన్నపూర్ణ మహేందర్ పిలుపునిచ్చారు.పట్టణంలోని యువ క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు క్రీడలపై ఆసక్తి పెంపొందించేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నారు.గ్రామపంచాయతీ నిధుల నుంచి రూ.70 వేలు వెచ్చించి బోథ్ పట్టణంలోని ఫ్రెండ్స్ క్లబ్ మైదానంలో క్రికెట్ నెట్ ప్రాక్టీస్, వాలీబాల్ క్రీడలకు అవసరమైన హైమాస్ట్ లైట్ సదుపాయాలను ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కుర్మే అన్నపూర్ణ మహేందర్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా క్రీడల వైపు దృష్టి సారించాలనే లక్ష్యంతో ఈ సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. యువ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్రికెట్ నెట్ ప్రాక్టీస్‌తో పాటు వాలీబాల్ క్రీడల్లోనూ చురుకుగా పాల్గొనాలని సూచించారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని పేర్కొన్నారు. యువత తమ ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకుని క్రీడల్లో ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడలు యువతలో నాయకత్వ లక్షణాలు, సమష్టి భావనను పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు.

నీటి లభ్యతను బట్టే రబీ సాగు ప్రణాళిక!

- వరికి ప్రత్యామ్నాయంగా ఉద్యాన, ఆయిల్‌పామ్ పంటల సాగుకు ప్రోత్సాహం
- ధాన్యం కొనుగోళ్లలో రైతులకు కనీస మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ అందించాలి
- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు 90 శాతానికి పెంచాలి
- జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశం

మహబూబాబాద్ జిల్లా
విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్



రానున్న రబీ 2026-27 వ్యవసాయ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని నీటి లభ్యత ఆధారంగా పంటల సాగు ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. నీటి వనరులను అంచనా వేయకుండా సంప్రదాయ పంటల సాగుకే పరిమితం కాకుండా, ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు రైతులను ప్రోత్సహించాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా, కనీస మద్దతు ధరతో పాటు ప్రభుత్వం ప్రకటించిన బోనస్ అందేలా పటిష్ట చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక, ధాన్యం కొనుగోళ్లు, విద్యాశాఖ, భూసేకరణ, వీధి కుక్కల నియంత్రణ, గ్రామీణ ఉపాధి హామీ పనుల పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మహబూబాబాద్ జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటి నిల్వలను పరిగణనలోకి తీసుకుని వరికి ప్రత్యామ్నాయంగా ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలన్నారు. సూక్ష్మ సేద్యం, పంటల వైవిధ్యీకరణ, రైతు ఐడీ నమోదు, కస్టమ్ హైరింగ్ కేంద్రాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటల సాగుతో కలిగే ప్రయోజనాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

ధాన్యం కొనుగోళ్లలో రైతులు నష్టపోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సీఎస్ ఆదేశించారు. ప్రైవేటు మార్కెట్లలో జరుగుతున్న కొనుగోళ్లను కూడా పరిశీలిస్తూ రైతులకు కనీస మద్దతు ధరతో పాటు క్వింటాలుకు ప్రభుత్వం ప్రకటించిన రూ.500 బోనస్ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేసి రైతుల వివరాల నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని, ధాన్యం సేకరణలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని స్పష్టం చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో 90 శాతం హాజరు తప్పనిసరి

విద్యాశాఖపై సమీక్షిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది హాజరును ఎఫ్‌ఆర్ఎస్ ద్వారా పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరు కనీసం 90 శాతానికి చేరేలా చర్యలు చేపట్టాలని, పాఠశాలల వారీగా విద్యా ప్రమాణాలను సమీక్షించాలని సూచించారు. ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ వంటి డిజిటల్ అభ్యసన వేదికలను వినియోగించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలన్నారు.

పెండింగ్ విద్యా నిర్మాణాలు వేగవంతం చేయాలి

రూసా 2.0, పీఎం ఉషా పథకాల కింద రాష్ట్రవ్యాప్తంగా మంజూరైన 41 పనుల్లో 8 పూర్తికాగా, మరో 33 పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. మంజూరైన నిధుల్లో ఇప్పటివరకు 41 శాతం మాత్రమే ఖర్చు చేసినందున మిగిలిన నిధులను వినియోగించి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. సమగ్ర శిక్ష అభియాన్, పీఎం శ్రీ పథకాల నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.11 వేల కోట్ల వ్యయంతో 87 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణాలు కొనసాగుతున్నాయని, ఇప్పటివరకు రూ.625 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. రూ.1,108 కోట్లతో మంజూరైన 115 తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణ పనులను కూడా త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు.

భూసేకరణకు అత్యంత ప్రాధాన్యత

సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్లకు సూచించారు. ఇందుకు అవసరమైన నిధులను అందుబాటులో ఉంచామని, అదనపు నిధులు అవసరమైతే మంజూరు చేస్తామని తెలిపారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు

గ్రామాలు, పట్టణాల్లో వీధి కుక్కల నియంత్రణకు సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో వీధి కుక్కలను గుర్తించి నిబంధనల ప్రకారం పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు.

నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత

వికసిత్ భారత్ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో నీటి సంరక్షణ పనులను విస్తృతంగా చేపట్టాలని, నీటి నిల్వలు, భూగర్భ జలాల పెంపునకు దోహదపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. కాలువల శుభ్రతతో పాటు అవసరమైన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్, ఇన్‌చార్జి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పురుషోత్తం, డీఆర్వో నాగలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, పశుసంవర్ధక శాఖ అధికారి కిరణ్, పరిశ్రమల అధికారి శ్రీమన్నారాయణ రెడ్డి, ఆర్‌అండ్‌బీ అధికారులు, వివిధ శాఖల సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణపై విద్యార్థినులకు అవగాహన కల్పించాలి

- కేజీబీవీలో ఆరోగ్య అవగాహన సదస్సు.. విద్యార్థినులకు రక్తహీనత పరీక్షలు



అడవిదేవులపల్లి విశాలభారతి: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల (కేజీబీవీ)లో బాల్య వివాహాల నివారణ, ఆరోగ్య సంరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థినులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సయ్యద్ అజహర్ అహ్మద్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులకు పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల బాలికల శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని, బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే చైల్డ్‌లైన్ టోల్ ఫ్రీ నంబర్ **1098**కు సమాచారం అందించాలని తెలిపారు. అనంతరం కౌమారదశలో బాలికలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, రుతుక్రమ పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణపై వైద్యపరమైన సూచనలు అందించారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాలలోని విద్యార్థినులందరికీ రక్తహీనత (అనీమియా) నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, అవసరమైన ఆరోగ్య సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో శాంతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేవతి, బాల్య వివాహాల నివారణ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి రాయుడు, పాఠశాల ఇన్‌ఛార్జ్ ఎస్.ఓ బి. స్వప్న, స్టాఫ్ నర్సు సుమలత, ల్యాబ్ టెక్నీషియన్ మురళీకృష్ణ, కేజీబీవీ ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

దామరవంచలో ఇంకుడు గుంతల నిర్మాణానికి శ్రీకారం

- భూగర్భ జలాల పెంపు, గ్రామ పారిశుధ్యమే లక్ష్యం



గూడూరు, విశాలభారతి: భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో గూడూరు మండల పరిధిలోని దామరవంచ గ్రామంలో శుక్రవారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఇంకుడు గుంతల నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలో వర్షపు నీటిని వృథా కాకుండా భూమిలోకి ఇంకేలా చేయడంతో పాటు భూగర్భ జలమట్టాన్ని పెంచేందుకు ఇంకుడు గుంతలు ఎంతగానో ఉపయోగపడతాయని ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. గ్రామానికి చెందిన దారం కిష్టయ్య, పత్తిపాక కొమ్మాలు, బంగారు వీరస్వామి నివాసాల వద్ద ఇంకుడు గుంతల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణపై అవగాహన పెంపొందించుకొని ఇంకుడు గుంతల నిర్మాణానికి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సనుప సుజాత సుదర్శన్, ఉపసర్పంచ్ కందికట్ల ఉపేందర్, గ్రామపంచాయతీ కార్యదర్శి సుమన్, టీఏ యుగంధర్, ఫీల్డ్ అసిస్టెంట్ బంగారు మల్లేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పబ్బోజు రాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలలో గూడూరు విద్యార్థికి ప్రథమ బహుమతి



గూడూరు,నవంబర్ 13 (విశాల భారతి): గూడూరు: మహబూబాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గూడూరు జెడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి కె. యశ్వంత్ రాజ్ ప్రథమ బహుమతి సాధించి పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చాడు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యత అనే అంశంపై నిర్వహించిన ఈ వ్యాసరచన పోటీలలో యశ్వంత్ రాజ్ తన ప్రతిభను చాటుకొని నియోజకవర్గ స్థాయిలో మొదటి బహుమతిని కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ప్రధానోపాధ్యాయులు ఎస్. సత్యనారాయణ మాట్లాడుతూ.. తమ పాఠశాల విద్యార్థి నియోజకవర్గ స్థాయిలో ప్రథమ బహుమతి సాధించడం ఎంతో గర్వకారణమని అన్నారు. విద్యార్థిని పోటీలకు సిద్ధం చేయడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, ప్రోత్సాహం అందించిన ఆంగ్ల ఉపాధ్యాయులు గుర్రాల వెంకటేశ్వర్లు కృషిని ఆయన అభినందించారు. అనంతరం విజేత విద్యార్థి కె. యశ్వంత్ రాజ్‌ను ప్రధానోపాధ్యాయులు ఎస్. సత్యనారాయణ, గైడ్ టీచర్ గుర్రాల వెంకటేశ్వర్లు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, తోటి విద్యార్థులు ఘనంగా అభినందించారు. భవిష్యత్తులో విద్యార్థి మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ నెల 28న ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ జాతీయ సదస్సు

- బ్రాహ్మణ ఫెడరేషన్ సెక్రెటరీ జనరల్ ద్రోణం రాజు రవి కుమార్



ముషీరాబాద్, విశాల భారతి: కాంగ్రెస్ ప్రభుత్వం బ్రాహ్మణులకు తగిన గుర్తింపు ఇవ్వడంతోపాటు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ స్థానాన్ని కేటాయించాలని బ్రాహ్మణ ఫెడరేషన్ సెక్రటరీ జనరల్ ద్రోణం రాజు రవి కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఇన్చార్జ్ నైషదం సత్యనారాయణమూర్తి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాజు రవి కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బ్రాహ్మణ కార్పొరేషన్‌కు తగిన నిధులు కేటాయించాలని, రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో బ్రాహ్మణులకు అధిక శాతంలో టికెట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.తెలంగాణ రాష్ట్రంలో 14 లక్షల జనాభా ఉన్న బ్రాహ్మణులకు తగిన గుర్తింపు ఇవ్వాలని కోరారు. అలానే బ్రాహ్మణుల సమస్యలపై దేశవ్యాప్తంగా ఈ నెల 28వ తేదీన బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు బ్రాహ్మణులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. జాతీయ ఉపాధ్యక్షులు నైషదం సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ బ్రాహ్మణ కులానికి చెందిన ఓ వ్యక్తి తన పదవిని అడ్డం పెట్టుకొని 1300కోట్ల స్కామ్కు తెరలేపారని అన్నారు. అగ్రహారం అని పేరు పెట్టి పేద బ్రాహ్మణులను మోసం చేయాలని చూస్తున్నారని ఇలాంటి విధానాలను సహించబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో ముఖ్య సలహాదారులు పెద్దబోట్లా లక్ష్మీనారాయణ, జాతీయ కార్యదర్శులు వారణాసి వంశీ, వక్కలంక శ్రీనివాస్, వైష్ణవి ప్రసాద్, తులసి శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు జొన్నల గడ్డ సూర్యకాంతం, జయతులసి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అండగా ఉందాం

- వేముల గోపీనాథ్ తుంగతుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి



శాలిగౌరారం, విశాలభారతి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం నూతన పింఛన్లను అందజేసి లబ్ధిదారులకు అండగా నిలిచారని తుంగతుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వేముల గోపీనాథ్ అన్నారు.. ఈ సందర్భంగా వేముల గోపీనాథ్ మాట్లాడుతూ శాలిగౌరారం మండల వ్యాప్తంగా నూతనంగా 1016 మందికి పింఛన్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం గత ప్రభుత్వం చేయని అనేక అభివృద్ధి సంక్షేమని చేస్తున్నారని, గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం నూతన పింఛన్లు రేషన్ కార్డులు ప్రజలకు మౌలిక వసతులు కల్పించలేదన్నారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు అండగా ఉందని తెలిపారు.సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ప్రతి ఒక్కరు అండగా నిలవాలని తెలిపారు. మరోసారి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమన్నారు..

వరి సాగుకు స్వస్తి.. పంట మార్పిడికి శ్రీకారం



- తక్కువ నీటితో పండే పంటల వైపు రైతులు మళ్లాలి
- భూసార పరిరక్షణకు ప్రకృతి వ్యవసాయమే మార్గం
- ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి

డోర్నకల్ విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్

సంప్రదాయ సాగు విధానాలకు మార్పులు చేసుకుంటూ పంట మార్పిడిని ఆచరించినప్పుడే వ్యవసాయం లాభసాటిగా మారుతుందని, భూసారాన్ని కాపాడుకోవడంతో పాటు భవిష్యత్‌లో సాగు సంక్షోభాన్ని నివారించవచ్చని ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి స్పష్టం చేశారు. డోర్నకల్ మండలం గొల్లచర్ల గ్రామ రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన రైతులకు దిశానిర్దేశం చేశారు. రసాయన ఎరువులు, పురుగుమందులపై అతిగా ఆధారపడటం వల్ల భూమి సహజ సారవంతం దెబ్బతింటోందని పేర్కొన్నారు. సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచి, ప్రకృతి ఆధారిత వ్యవసాయ పద్ధతులను అమలు చేయాలని సూచించారు. పంట వ్యర్థాలను తగులబెట్టి భూమి సారాన్ని నాశనం చేయకుండా, వాటిని భూమిలో కలియదున్ని సారవంతం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకుని, నేల స్వభావానికి అనుగుణంగా పంటలు, ఎరువులు ఎంపిక చేసుకోవాలని సూచించారు. యాసంగిలో వరి సాగు తగ్గించాలి.. ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలి: రానున్న కాలంలో నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని యాసంగిలో వరి సాగును తగ్గించి, తక్కువ నీటితో సాగయ్యే జొన్నలు, పప్పు ధాన్యాలు, నూనెగింజలు, కూరగాయల సాగుకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే వాతావరణ ప్రతికూల పరిస్థితులను ముందుగానే అంచనా వేసి పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీటి వనరులు, విద్యుత్‌ను వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని తెలిపారు. వ్యవసాయాన్ని కాపాడుకోవడం అంటే కేవలం పంటలు పండించడం మాత్రమే కాదని, నేల ఆరోగ్యం, నీటి వనరులు, ప్రకృతి సమతుల్యతను కాపాడుకోవడమని పేర్కొన్నారు. పంటల వైవిధ్యం, పంట మార్పిడి, ప్రకృతి సాగు విధానాలను ప్రతి రైతు ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అనిల్, సర్పంచులు పగిడాల వెంకటేశ్వర్లు, శీను, ఏపీవో పార్థసారథి, ఏఈవో పవన్, పలువురు రైతులు పాల్గొన్నారు.

లంబాడి హక్కుల పోరాట సమితి అధ్యక్షుడిగా జాటోత్ మంగీలాల్ నాయక్





విశాలభారతి, గూడూరు:

లంబాడి హక్కుల పోరాట సమితి గూడూరు మండల స్థాయి సమావేశం శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సమావేశంలో సమితి నూతన మండల అధ్యక్షుడిగా జాటోత్ మంగీలాల్ నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగీలాల్ నాయక్ గత అనేక సంవత్సరాలుగా లంబాడి హక్కుల పోరాట సమితిలో చురుకుగా పని చేస్తూ, గతంలో నిర్వహించిన సైకిల్ ర్యాలీతో పాటు గూడూరులో సమితి చేపట్టిన పలు కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పాల్గొన్నారు. ఆయన సేవలను గుర్తించిన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసు నాయక్ నూతన మండల అధ్యక్షుడిగా ఆయన ఎన్నికను ప్రకటించారు.

నూతన మండల కమిటీ నియామకాలు:

మండల అధ్యక్షుడు: జాటోత్ మంగీలాల్ నాయక్
మండల ప్రధాన కార్యదర్శి: గుగులోత్ బాలు నాయక్
మండల ఉపాధ్యక్షులు: భూక్య సుందర్ నాయక్
మండల కార్యదర్శులు: తేజావత్ దేవిలాల్ నాయక్, బోడ గోపి నాయక్
మండల శాఖ గౌరవ సలహాదారులుగా ఎన్నికైన వారు:

1. బానోతు నరసింహ నాయక్ - తాళ్లపాటి తండా
2. వాంకుడోత్ కొమ్ములు నాయక్ - గూడూరు
3. నునావత్ రమేష్ నాయక్ - గూడూరు
4. భూక్య వెంకన్న - బొల్లెపల్లి
5. గుగులోత్ రాంబాబు నాయక్ - దసురు తండా

ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన నాయకులు తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసు నాయక్, రాష్ట్ర కార్యదర్శి భూక్య జగన్ నాయక్, సమితి సీనియర్ నాయకులు ధారావత్ కిరియా, వాంకుడోత్ వాల్య నాయక్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. లంబాడి హక్కుల పరిరక్షణ, గిరిజన సమస్యల పరిష్కారం, తండాల అభివృద్ధి లక్ష్యంగా సమితిని మరింత బలోపేతం చేసేందుకు నూతన కమిటీ కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు

రోడ్డు ప్రమాదంలో చుక్కల దుప్పి మృతి

గూడూరు, విశాలభారతి: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని దామరవంచ బస్టాండ్ సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో చుక్కల దుప్పి మృతి చెందగా, ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే.. దామరవంచ సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి ఓ చుక్కల దుప్పి రోడ్డు దాటుతుండగా, అదే సమయంలో జాతీయ రహదారిపై వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనం దుప్పిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చుక్కల దుప్పి అక్కడికక్కడే మృతి చెందింది. బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో, గాయపడిన వ్యక్తిని గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న గూడూరు అటవీ శాఖ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మృతి చెందిన చుక్కల దుప్పిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పంచనామా నిర్వహించి, అటవీ శాఖ నిబంధనల ప్రకారం అటవీ ప్రాంతంలో పూడ్చిపెట్టారు. అటవీ ప్రాంతం గుండా వెళ్లే జాతీయ రహదారిపై వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని, వన్యప్రాణులు రోడ్డు దాటే సమయంలో ప్రమాదాలు జరగకుండా వాహన వేగాన్ని నియంత్రించాలని స్థానికులు సూచిస్తున్నారు.

ట్రినిటీ హైస్కూల్లో ఘనంగా బాలల దినోత్సవం

- జవహర్ లాల్ నెహ్రూ పుట్టినరోజును బాలల దినోత్సవంగా జరుపుకుంటాం
- ఉజ్జిని మంజుల ట్రినిటీ పాఠశాలల ప్రిన్సిపల్ కం డైరెక్టర్



చౌటుప్పల్,విశాల భారతి: చౌటుప్పల్ మున్సిపాలిటీ పట్టణంలోని ట్రినిటీ హైస్కూల్ ఐఐటి జోన్ లో శుక్రవారం ముందస్తుగా బాలల దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. బాలలందరూ వివిధ వేషధారణలో వచ్చి అందరినీ ఆనందపరిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్కూల్ డైరెక్టర్ కం ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల హాజరై పిల్లలకు నవంబర్ 14న భారతదేశ మొదటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ పుట్టినరోజును బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. నెహ్రూకు పిల్లలంటే అమితమైన ప్రేమ ఉంటుందని, పిల్లలు ఎలా ఉండాలి, ఎలాంటి విషయాలను నేర్చుకోవాలి, సమాజంలో మంచి చెడులను ఎలా గ్రహించాలో వివిధ సమస్యల గురించి ప్రిన్సిపాల్ పిల్లలకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ కే వి బి కృష్ణారావు, ఐఐటి ఇంచార్జ్ అనుష, ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ చందన మరియు ఉపాధ్యాయులు జ్యోతి, శిరీష, ధనలక్ష్మి, హారిక, భార్గవి, లావణ్య, సింధు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

డిసెంబర్ వరకే హైదరాబాద్‌కు నీళ్లు.. ఆ తర్వాత తీవ్ర కొరత తప్పదా?

విశాల భారతి: సింగూరు, మంజీరా జలాశయాల నుంచి నీటి సరఫరా జరిగే ప్రాంతాలపై కొరత ప్రభావం పడే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. శేరిలింగంపల్లి, పటాన్‌చెరు, జూబ్లీ హిల్స్, కూకట్‌పల్లి, సనత్‌నగర్, రాజేంద్రనగర్, ఖైరతాబాద్ నియోజకవర్గాల్లో నీటి సరఫరా కష్టతరంగా మారవచ్చని భావిస్తున్నారు. వీటిలో ముఖ్యంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంపై ప్రభావం ఎక్కువగా ఉండొచ్చని హెచ్చరికలు వెలువడుతున్నాయి. సింగూరు, మంజీరా జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ మార్గాలపై అధికారులు దృష్టి సారించారు. ప్రస్తుతం ఈ రెండు జలాశయాల నుంచి నీళ్లు సరఫరా అవుతున్న ప్రాంతాలకు గోదావరి జలాలను మళ్లించే అవకాశాలను పరిశీలిస్తున్నారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. సకాలంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోతే నగరంలోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరాపై ప్రభావం పడే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో గోదావరి జలాల వినియోగంపై నిపుణులు కీలక ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. సుమారు ఆరు నెలల క్రితం గోదావరి నీటిని కిందకు పదలకుండా నిల్వ చేసుకుని ఉంటే ప్రస్తుత పరిస్థితి ఎదురయ్యేది కాదని వారు అభిప్రాయపడుతున్నారు. నీటి లభ్యత, భవిష్యత్తు అవసరాలను ముందుగానే అంచనా వేసి జలవనరుల నిర్వహణ చేపట్టాల్సి ఉండేదని విమర్శిస్తున్నారు.



పంచముఖ ఆంజనేయ స్వామి వార్షికోత్సవంలో ప్రత్యేక పూజలు

- సరూర్ నగర్‌లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న క్యామ మల్లేష్, యేగ్గే మల్లేష్

విశాల భారతి, ఎల్బీనగర్: సరూర్ నగర్‌లో రైస్ ట్రేడర్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వారి తృతీయ వార్షికోత్సవ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి క్యామ మల్లేష్, మాజీ ఎమ్మెల్సీ, కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యేగ్గే మల్లేష్ పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించగా, భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వార్షికోత్సవ వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగాయి.ఈ కార్యక్రమం లో స్థానిక నాయకులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రామ్ శేఖర్‌తో దొడ్డి చంద్రం కురుమ భేటీ

- దొడ్డి కొమురయ్య మనుమడికి ఆత్మీయ స్వాగతం పలికిన బీఎస్పీ నాయకులు



విశాలభారతి, ఎల్ బి నగర్: తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు, తెలంగాణ భగత్‌సింగ్‌గా పేరొందిన దొడ్డి కొమురయ్య కురుమ మనుమడు దొడ్డి చంద్రం కురుమ బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రామ్ శేఖర్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో బీఎస్పీ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ మంతాపురం బాలన్న, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీ రామకృష్ణ, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షుడు గుండె శ్రీనివాస్, తుర్కయాంజాల్ డివిజన్ అధ్యక్షుడు అడ్వకేట్ పట్నం రమేష్‌కురుమ, ఉపాధ్యక్షుడు ఎల్. రాజు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆనంద్ గౌడ్ పుట్టినరోజు వేడుకలు



సికింద్రాబాద్, విశాల భారతి: గంధ మల్ల ఆనంద్ గౌడ్ పుట్టినరోజు వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. భారతీయ జనతా పార్టీ ఓ బి సి అధ్యక్షులు ఆనంద్ గౌడ్ కి పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బిజెపి నాయకుడు పొట్లకాయల వెంకటేశ్వర్లు ముదిరాజ్ తదితరులు ఆనంద్ గౌడ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి స్వీట్లు తినిపించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

- బిఆర్ఎస్ నాయకులు - మంద జగన్



సికింద్రాబాద్, విశాల భారతి : బౌద్ధనగర్ డివిజన్ పరిధిలోని అంబర్ నగర్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్యను స్థానిక బస్తీవాసులు నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న ఉద్యమకారుడు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మాజీ వార్డు మెంబర్ మంద జగన్ వెంటనే స్పందించి సమస్య ఉన్న ప్రాంతానికి చేరుకున్నారు. స్థానిక పరిస్థితులను పరిశీలించిన మంద జగన్ సంబంధిత సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టి డ్రైనేజీ సమస్యను పరిష్కరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి వెంటనే స్పందించడం జరిగిందని, బస్తీలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంబర్ నగర్ అధ్యక్షుడు కొండ కిషోర్ గౌడ్, ఉపాధ్యక్షుడు మంద మురళి, అంబర్ నగర్ జనరల్ సెక్రటరీ, బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు సాయి వ్ చరణ్ గంగపుత్ర, స్థానిక నాయకులు, బస్తీవాసులు తదితరులు పాల్గొన్నారు.

చెత్త విద్యుత్ కేంద్రానికి వ్యతిరేకంగా ఉద్యమం


- జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి
- కాంగ్రెస్ పాలనలో నియోజక వర్గం అస్తవ్యస్తం
- ఎమ్మెల్యే లాలూచీతోనే పనికిరాని పనులు



విశాల భారతి ఇబ్రహీంపట్నం: యాచారంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయ తలపెట్టిన శ్రీ వెంకటేశ్వర పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం నిర్వహిస్తామని జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు , మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈమేరకు ఆయన శుక్రవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. 2010 వ సంపత్సరంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని తాను ఎమ్మెల్యే గా తిప్పికొట్టానని చెప్పారు. తిరిగి 16 సంవత్సరాల తరువాత మళ్లీ అదే చెత్త నిర్ణయం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందని ఆయన ధ్వజమెత్తారు. యాచారం మండల కేంద్రంలో చెత్తతో విద్యుత్ ఉత్పత్తి చేసే వెంకటేశ్వర పవర్ ప్రాజెక్టుకు తిరిగి ఊపిరి పోయడం నిగ్గుచేటని మండిపడ్డారు. ప్రతిరోజు 700 టన్నుల చెత్తను హైదరాబాద్ నుండి తెచ్చి ఇక్కడ కరెంట్ ఉత్పత్తి చేస్తామన డం సరికాదన్నారు. యాచారం మండలాన్ని మరో జవహర్ నగర్ డంపింగ్ యార్డులా మార్చాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నిందని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే లాలూచీపడి చోద్యం చూస్తున్నారని , అందుకే ప్రభుత్వం ఇటువంటి చెత్త నిర్ణయాలు తీసుకుంటున్నదని దుయ్యబట్టారు. రోజుకు 300 వందల లారీల చెత్తను హైదరాబాద్ నుండి తెచ్చి ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని ఏం చేద్దామనుకుంటున్నారని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. రంగారెడ్డి జిల్లాను సర్వనాశనం చేసే కుట్రలో భాగంగానే ఇటువంటి చెత్త పనులు జరుగుతున్నాయని ఆయన మండిపడ్డారు. వెంటనే ఈ విషయంపై ప్రభుత్వం వెనక్కి తగ్గాలని లేదంటే తిరుగుబాటు తప్పదని ఆయన హెచ్చరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి , మండల పార్టీ అధ్యక్షుడు కర్నాటి రమేష్ గౌడ్ , కార్యదర్శి పాశ్చ బాషా , సింగిల్ విండో చైర్మన్ రాజేందర్ రెడ్డి తదితరులు కూడా కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుబట్టారు.

కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అభిషేక్‌రెడ్డి అండ

- మృతి చెందిన కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ
- చిన్నారుల భవిష్యత్తుకు భరోసా



విశాల భారతి, ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం మండలం తులేకలాన్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు పంబలి పాండు, బోడ మహేందర్ కుటుంబాలను శుక్రవారం పార్టీ రాష్ట్ర నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి పరామర్శించారు. కుటుంబ పెద్దలను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. కుటుంబాల్లోని చిన్నారులను ఆప్యాయంగా పలకరించి, వారి బాగోగులు తెలుసుకున్నారు. ఆప్తులను కోల్పోయిన కుటుంబాలకు తాము అండగా ఉంటామని, భవిష్యత్తులో ఏ అవసరం వచ్చినా తోడుగా నిలుస్తామని హామీ ఇచ్చారు. చిన్నారుల భవిష్యత్తుకు భరోసా కల్పిస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా అభిషేక్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం నిత్యం కష్టపడిన ఇద్దరు కార్యకర్తలను కోల్పోవడం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.

నల్లగొండ రైతు బహిరంగ సభను జయప్రదం చేయండి

- రైతులు, వ్యవసాయ కార్మికులు వేలాదిగా తరలిరావాలి
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మట్టిపల్లి సైదులు పిలుపు

మోతె , నవంబర్ 13 విశాల భారతి



రైతాంగ హక్కుల సాధన కోసం, వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడం కోసం నల్లగొండ గడ్డపై మరో చారిత్రాత్మక పోరాటానికి సిద్ధం కావాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మట్టిపల్లి సైదులు పిలుపునిచ్చారు. అఖిలభారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభల సందర్భంగా నవంబర్ 15న నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల మైదానంలో నిర్వహించే భారీ బహిరంగ సభను రైతులు, వ్యవసాయ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.శుక్రవారం మండల పరిధిలోని బుర్కచర్ల,నాగయ్యగూడెం,విభళ్ళ పురం, మామిళ్లగూడెం గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రైతులు,వ్యవసాయ కార్మికులను కలిసి మహాసభల ప్రాధాన్యతను వివరించి బహిరంగ సభకు తరలిరావాలని కోరారు.ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతన్నను అప్పుల ఊబిలోకి నెట్టి, వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే విధానాలను కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తోందని విమర్శించారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని, రైతులకు పెట్టుబడి భారంగా మారిందని, వ్యవసాయ కార్మికులకు ఉపాధి భద్రత లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలను తిప్పికొట్టాలని, వ్యవసాయ కార్మికులకు ఏడాదికి 200 రోజుల పని, రోజుకు రూ.700 కూలి కల్పించాలని డిమాండ్ చేశారు.రైతులకు న్యాయమైన మద్దతు ధర, పంట నష్టపరిహారం, రుణ విమోచన, వ్యవసాయ కార్మికులకు సమగ్ర సంక్షేమం, ఉపాధి హక్కుల సాధన కోసం ఐక్య పోరాటాలు తప్పని సరి అన్నారు. రైతులు, కూలీలు విడివిడిగా కాకుండా ఐక్యంగా ఉద్యమించినప్పుడే పాలకుల మెడలు వంచి హక్కులను సాధించుకోగలమని స్పష్టం చేశారు.తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రకు సాక్షిగా నిలిచిన నల్లగొండ గడ్డపై జరిగే ఈ జాతీయ మహాసభలు దేశ రైతాంగానికి నూతన పోరాట స్ఫూర్తిని అందించనున్నాయని తెలిపారు. నవంబర్ 15న జరిగే బహిరంగ సభకు మండలం నుంచి రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు వేలాదిగా తరలివచ్చి కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై తమ నిరసన గళాన్ని వినిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి నాగం మల్లయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు చర్లపల్లి మల్లయ్య, కొండ రాములు, రైతు సంఘం మండల నాయకులు కక్కిరేణి సత్యనారాయణ, సిఐటియు మండల నాయకులు కొండ భాస్కర్, చెరుకు శ్రీను, ఐద్వా మండల నాయకురాలు షేక్ జనాభి, ఇందిర, మంజుల, నిర్మల,రాజు, ములుకూరి సాగర్ రెడ్డి, బుర్రాజు వెంకన్న, మల్సూరు, గౌస్ పాల్గొన్నారు.

అనుమానం పెనుభూతమై.. భార్యను కడతేర్చిన భర్త

- ఉపాధి నెపంతో ఒడిశా నుంచి తీసుకొచ్చి దారుణం
- ఆదిభట్ల పీఎస్ పరిధిలో ఘటన
- 24 గంటల్లోనే నిందితుడి అరెస్ట్

విశాల భారతి ఇబ్రహీంపట్నం



భార్యపై ఉన్న అనుమానం ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. ఉపాధి నెపంతో ఒడిశా నుంచి భార్య, పిల్లలను తీసుకొచ్చిన ఓ భర్త పక్కా ప్రణాళికతో ఆమెను దారుణంగా హత్య చేశాడు. ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం రేపిన ఈ ఘటనలో నిందితుడిని పోలీసులు 24 గంటల్లోనే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆదిభట్ల ఇన్‌స్పెక్టర్ ఎస్. రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన ఘనశ్యామ్ పూజారి (33), తన భార్య ఉనిత పూజారి అలియాస్ హుక్యా మజి (32)కి స్వగ్రామానికి చెందిన మరో వ్యక్తితో అక్రమ సంబంధం ఉందని అనుమానించేవాడు. ఈ విషయమై తరచూ భార్యను శారీరకంగా, మానసికంగా వేధించేవాడు.

పక్కా ప్రణాళికతో హత్య.

భార్యను ఎలాగైనా హత్య చేయాలని నిర్ణయించుకున్న ఘనశ్యామ్, ఉపాధి కోసం వెళ్దామని నమ్మించి ఈ నెల 7న భార్య, పిల్లలను ఓడిశా నుంచి ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని కొంగరకలాన్‌లో ఉన్న వీఎస్‌బీ బ్రిక్స్‌కు తీసుకొచ్చాడు. ఈ నెల 11న రాత్రి భోజనం అనంతరం ఉనిత బహిర్భూమికి వెళ్లగా, ఆమె వెంట వెళ్లిన ఘనశ్యామ్ కంపెనీ వెనుక ఉన్న నిర్మానుష్య ప్రాంతంలో స్కార్ఫ్‌తో ఆమె గొంతు బిగించి ఊపిరాడకుండా చేసి హత్య చేశాడు. అనంతరం కంపెనీ సూపర్‌వైజర్ రాజుపాలెం హేమాద్రి, ఇతర కార్మికులు నిలదీయగా తానే హత్య చేసినట్లు అంగీకరించాడు. అయితే మృతదేహం ఉన్న ప్రదేశాన్ని చూపిస్తానని నమ్మించి వారిని మరో ప్రాంతానికి తీసుకెళ్లి అక్కడి నుంచి పరారయ్యాడు.

పారిపోతుండగా పట్టుకున్న పోలీసులు.

నిందితుడు పరారైన విషయంపై సూపర్‌వైజర్ హేమాద్రి ఫిర్యాదు చేయడంతో ఆదిభట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఈ నెల 12న ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు మీదుగా విజయవాడ జాతీయ రహదారి వైపు పారిపోవడానికి ప్రయత్నిస్తున్న ఘనశ్యామ్‌ను సూపర్‌వైజర్ హేమాద్రి గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఆదిభట్ల పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 997/2026, బీఎన్ఎస్ సెక్షన్ 103(1) కింద కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు






- శంషాబాద్‌లో 16 ట్రాఫిక్ కేసుల పరిష్కారం.. రూ.38,700 జరిమానా
- మద్యం సేవించి వాహనాలు నడిపిన ముగ్గురికి జైలు శిక్ష, సమాజ సేవ

రాజేంద్రనగర్, విశాల భారతి :

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై శంషాబాద్ ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. రహదారి భద్రతను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేస్తూ, నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేసి న్యాయస్థానం ద్వారా చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా నవంబర్ 3, 2026న రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయ (ఆర్జీఐఏ) ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించి మొత్తం 16 కేసులను పరిష్కరించగా, రూ.38,700 జరిమానా విధించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన కేసుల్లో నిందితులను రాజేంద్రనగర్ పదో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి కె. వేణుగోపాల్ రెడ్డి ఎదుట హాజరుపరిచారు. ఈ కేసులను విచారించిన న్యాయస్థానం ముగ్గురికి శిక్షలు విధించింది. ఎస్. వేణుకు ఒక రోజు సాధారణ కారాగార శిక్షతో పాటు రూ.2,500 జరిమానా విధించగా, బి. గోపికి ఒక రోజు సమాజ సేవతో పాటు రూ.2,500 జరిమానా, టి. భరత్ కుమార్‌కు ఒక రోజు సమాజ సేవతో పాటు రూ.2,500 జరిమానా విధించింది. ఇక మిగిలిన మద్యం సేవించి వాహనాలు నడిపిన కేసుల్లో జరిమానాల రూపంలో రూ.28,000 వసూలు చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపినందుకు మరో రెండు కేసులు నమోదు చేసి రూ.3,200 జరిమానా విధించారు. ఇలా మొత్తం 16 కేసుల్లో రూ.38,700 జరిమానా విధించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ సందర్భంగా శంషాబాద్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రాణాపాయ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, డ్రైవింగ్ సమయంలో తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే జరిమానాలతో పాటు న్యాయస్థానం ద్వారా జైలు శిక్షలు, ఇతర శిక్షలు కూడా ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.ప్రజల ప్రాణాలను కాపాడటం, రహదారులపై ప్రమాదాలను తగ్గించడం,సురక్షితమైన ప్రయాణాన్ని అందించడం లక్ష్యంగా ఆర్జీఐఏ ట్రాఫిక్ పోలీసులు నిరంతరం చర్యలు చేపడుతున్నారని తెలిపారు. వాహనదారులందరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని, తమతో పాటు ఇతరుల భద్రతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. ప్రమోద్ కుమార్ కోరారు.

సీపీగా మహేశ్ భగవత్ బాధ్యతల స్వీకరణ

విశాల భారతి, సిటీబ్యూరో:



నగర నూతన పోలీసు కమిషనర్‌గా మహేశ్ భగవత్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బంజారాహిల్స్‌లోని హైదరాబాద్ కమిషనరేట్ కార్యాలయంలోని తన చాంబర్‌లో నగర 63వ కొత్వాల్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అంతకుముందు గత సీపీ సజ్జనార్ కొత్త కమిషనర్ భగవత్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. అనంతరం మహేశ్ భగవత్ మీడియాతో మాట్లాడుతూ సైబర్ నేరాల నియంత్రణ, డ్రగ్స్ మాఫియాపై ఉక్కుపాదం మోపుతామని, ఇటువంటి విషయాల్లో కఠినంగా వ్యవహరిస్తామన్నారు. సిటీలో మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఉంటుందని, మహిళలతో అసభ్యంగా ప్రవర్తించే వారిపై కఠినచట్టాలు ఉపయోగించిన శిక్షిస్తామన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్య ఉందని, ఇప్పటికే అనేక విధానాలు అమలు చేయడం ద్వారా ట్రాఫిక్ చిక్కుల నుంచి పరిష్కారం చూపిస్తున్నామని, రాబోయే రోజుల్లో మరింత మెరుగ్గా ట్రాఫిక్ నిర్వహణ ఉంటుందని భరోసా ఇచ్చారు.

అధికారుల నిర్లక్ష్యానికి వెంకటేశ్వర కాలనీ ప్రజలు బలి కావాలా?



విశాల భారతి, ఎల్ బి నగర్: అధికారుల ప్రణాళికా లోపాలు, ఇంజనీరింగ్ వైఫల్యాలతో ప్రజలు మురుగు నీటి సమస్యలను ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొనడం ఎంతవరకు సమంజసమని వెంకటేశ్వర కాలనీ సమస్యపై స్పందించిన అధికారులు, సంబంధిత విభాగాల పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తారు. కాలనీలో తీవ్రంగా వేధిస్తున్న మురుగునీటి సమస్యను పరిష్కరించేందుకు GHMC ఇంజనీరింగ్, HMWSB సీవరేజ్ విభాగాల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు.

వర్షపు నీటి క్యాచ్ పిట్స్‌తో మురుగునీటి సమస్య

క్షేత్రస్థాయి పరిశీలనలో వర్షపు నీటిని బయటకు పంపించేందుకు తాత్కాలికంగా నిర్మించిన క్యాచ్ పిట్స్‌ను సీవరేజ్ లైనేజీకి అనుసంధానం చేయడమే సమస్యకు ప్రధాన కారణంగా ప్రాథమికంగా గుర్తించారు. ఈ అనుసంధానం కారణంగా మురుగునీరు పొంగిపొర్లడం, దుర్వాసన వ్యాపించడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని, దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తించారు.

శాశ్వత పరిష్కారం చూపాల్సిందే.. అధికారులకు స్పష్టమైన సూచనలు

సమస్యను కేవలం తాత్కాలిక చర్యలతో వదిలేయకుండా GHMC ఇంజనీరింగ్, HMWSB సీవరేజ్ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమస్యకు మూలకారణాలను గుర్తించి, అవసరమైన సాంకేతిక చర్యలు చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. అధికారుల మధ్య సమన్వయ లోపం, ప్రణాళికా వైఫల్యాలకు సామాన్య ప్రజలు ఎందుకు ఇబ్బందులు పడాలని ప్రశ్నించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించడం కాదు.. వారి సమస్యలను పరిష్కరించడం అధికారుల ప్రధాన బాధ్యత అని పేర్కొంటూ, వెంకటేశ్వర కాలనీ ప్రజలకు మురుగునీటి సమస్య నుంచి విముక్తి కల్పించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

భారత్ సమ్మిట్‌లో పాల్గొన్న యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో కలిసి హాజరు



విశాల భారతి, ఎల్ బి నగర్: తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్ కార్యక్రమంలో తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లతో కలిసి ఆయన కార్యక్రమానికి హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో రాష్ట్ర నాయకులతో కలిసి యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది.

పందెన్వాగులో మురుగునీటి విషప్రవాహం.. పైప్‌లైన్ పనులు ఆపకుంటే ప్రజా ఉద్యమం



రాజేంద్రనగర్, విశాల భారతి : పందెన్వాగు (పంట కాలువ)లో మురుగునీరు ప్రవహిస్తుండటంతో పరిసర ప్రాంతాల్లో దుర్వాసన వ్యాపించి స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పందెన్వాగు (పంట కాలువ) పరిరక్షణ సమితి ఆవేదన వ్యక్తం చేసింది. మణికొండలో గత మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న రాజకీయ, పాలనా విధానాల ఫలితంగా పందెన్వాగు పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోందని సమితి ప్రతినిధులు ఆరోపించారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు మున్సిపల్ అధికారులు తలొగ్గుతూ ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు . వర్షపు నీటి పారుదల పేరుతో మురుగునీటిని పందెన్వాగులోకి మళ్లించేందుకు ప్రణాళికాబద్ధంగా పైప్‌లైన్ నిర్మాణానికి ప్రయత్నాలు జరిగాయని, స్థానిక ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో పనులు తాత్కాలికంగా నిలిచిపోయాయని తెలిపారు. ఈ వ్యవహారంపై గత నవంబర్ 2న ప్రజావాణిలో గ్రీవెన్స్ నంబర్ 211266230618, నవంబర్ 9న గ్రీవెన్స్ నంబర్ 911266247598 ద్వారా ఫిర్యాదులు చేసినప్పటికీ, వాటిపై అధికారులు తీసుకున్న చర్యల నివేదికను అందించలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పందెన్వాగు పరిరక్షణ సమితి ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ్ రావు, ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్, నిర్వహణ కార్యదర్శి శంకర్ సంబంధిత అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. చట్ట ప్రకారం మురుగునీటి కాలువలు, వర్షపు నీటి పారుదల కాలువలు వేర్వేరుగా ఉండాలని, నిబంధనలను ఉల్లంఘించి మురుగునీటిని వర్షపు నీటి కాలువల్లోకి మళ్లించడం సరికాదని వారు స్పష్టం చేశారు. ఈ సమస్యపై ప్రజలకు వాస్తవాలు తెలియజేసేందుకు మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం, జలమండలి, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో కూడిన స్వతంత్ర సాంకేతిక బృందాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపాదిత ప్రాజెక్టుకు సంబంధించిన పరిపాలనా అనుమతులు, సాంకేతిక అనుమతులు, ఆమోదిత నిర్మాణ నమూనాలు, అంచనా వ్యయం, టెండర్ వివరాలు, కాంట్రాక్టర్ వివరాలను బహిర్గతం చేయాలని కోరారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి సమగ్ర నివేదికను ప్రజలకు అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 127వ మణికొండ డివిజన్‌లో డ్రీమ్ వ్యాలీ నుంచి పందెన్వాగు వరకు ప్రతిపాదించిన పైప్‌లైన్ నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని సమితి సభ్యులు డిమాండ్ చేశారు. స్వతంత్ర సాంకేతిక బృందం విచారణ పూర్తి చేసి నివేదికను ప్రజలకు వెల్లడించే వరకు పనులు చేపట్టరాదని స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే స్పందించాలని, లేనిపక్షంలో ప్రజా ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే న్యాయపోరాటంలో భాగంగా జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్తామని పందెన్వాగు పర

12 గంటలు.. 10 గ్రామాలు.. అభివృద్ధి పనులకు శ్రీకారం

- పల్లెపల్లెకు చేరిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవాలు
- రోడ్లు, డ్రైనేజీలు, భవనాలకు శంకుస్థాపనలు
- కొత్తగా మంజూరైన 119 చేయూత పింఛన్ల ప్రొసీడింగ్స్ పంపిణీ

విశాల భారతి,షాద్‌నగర్:



ఒకే రోజు.. పది గ్రామాలు.. 12 గంటల నిర్విరామ పర్యటన.. ఎక్కడ చూసినా అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు.. ప్రజల మధ్యే గడుపుతూ వారి సమస్యలను తెలుసుకుంటూ షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సాగించిన పర్యటన నియోజకవర్గంలో ప్రత్యేకంగా నిలిచింది. ఉదయం 7 గంటలకు మొదలైన పర్యటన సాయంత్రం 7 గంటల వరకు కొనసాగింది. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తూ ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవాలు, సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీలు, మహిళా సమాఖ్య భవనాలు, గ్రామపంచాయతీ భవనాలకు శంకుస్థాపనలు, పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు.ఫరూఖ్‌నగర్ మండలం చించోడు పరిధిలోని గౌరీకుంట తండాలో గిరిజన కుటుంబం నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని ఉదయాన్నే ఎమ్మెల్యే ప్రారంభించారు. లబ్ధిదారులైన దంపతులకు నూతన వస్త్రాలు అందజేసి, వారి ఆతిథ్యాన్ని స్వీకరించారు. అనంతరం ఫరూఖ్‌నగర్‌లో నిర్వహించిన చేయూత పింఛన్ల గుర్తింపు పత్రాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు. అక్కడి నుంచి కొత్తూరు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటిస్తూ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. పెంజర్లలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్నారు. కొడిచర్లలో సీసీ రోడ్లు, డ్వాక్రా భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేసి, నూతనంగా మంజూరైన పింఛన్ల ప్రొసీడింగ్స్ పంపిణీ చేశారు. కొడిచర్ల తండా, భాజిగూడ తండాల్లో డ్వాక్రా భవనాలను ప్రారంభించి, సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేయడంతో పాటు గృహప్రవేశ కార్యక్రమంలోనూ పాల్గొన్నారు. ఎస్‌బీ పల్లిలో మహిళా సమాఖ్య భవనం, గ్రామపంచాయతీ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. హైమాస్ట్ లైట్లను ప్రారంభించి, సీసీ రోడ్లు, భూగర్భ మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. సిద్ధాపూర్ పరిధిలోని చింతగట్టు తండాలో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. సిద్ధాపూర్‌లో వాటర్ ఫిల్టర్ ప్లాంట్, ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించి, గ్రామపంచాయతీ భవనం, సీసీ రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. వైఎం తండాలో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి వీధి దీపాలను ప్రారంభించారు.సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టడంతో పాటు ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుకలో పాల్గొన్నారు. ఇన్ముల్ నర్వ గ్రామంలోని ఎస్సీ కాలనీలో అంబేద్కర్ భవనాన్ని ప్రారంభించారు.కొత్తూరు మండల కేంద్రంలోని కుమ్మరిగూడలో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి, కొత్తూరు నాలుగో వార్డులో పోలీస్ స్టేషన్ వద్ద పార్కు అభివృద్ధి పనులకు రూ.85 లక్షలతో శ్రీకారం చుట్టారు. రెండు ట్రాక్టర్లను పంపిణీ చేశారు. మొత్తం 119 మంది లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన చేయూత పింఛన్ల ప్రొసీడింగ్స్ అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, భూగర్భ మురుగునీటి కాలువలు, మహిళా సమాఖ్య, గ్రామపంచాయతీ భవనాలు నిర్మిస్తూ మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నామని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు నియోజకవర్గంలోని పల్లెల సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.ఈ పర్యటనలో కొత్తూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శేఖర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్లు అంబటి ప్రభాకర్, శ్రీకాంత్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, గోవర్ధన్ గౌడ్ పలువురు ప్రజాప్రతినిధులు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నార్సింగి సర్కిల్ పరిధిలో 10 రోజుల పాటు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం



రాజేంద్రనగర్, విశాల భారతి : సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరచడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే లక్ష్యంతో 10 రోజుల పాటు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ ప్రత్యేక కార్యక్రమం తొలిరోజు నార్సింగి సర్కిల్ పరిధిలో విస్తృతంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా నార్సింగి సర్కిల్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించారు. ఖాళీ స్థలాల్లో (ఓపెన్ ప్లాట్లలో) పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేయడంతో పాటు ఆయా స్థలాల యజమానులకు ప్రత్యేక సూచనలు చేశారు. తమ ఖాళీ స్థలాల్లో చెత్త వేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని వారికి అవగాహన కల్పించారు. అదేవిధంగా సేకరించిన చెత్తను శాస్త్రీయ పద్ధతుల్లో తరలించేలా అధికారులు చర్యలు చేపట్టారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త పేరుకుపోకుండా నిరంతరం పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు. ఈ ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా సైబరాబాద్ అదనపు కమిషనర్ (పారిశుద్ధ్యం), డిప్యూటీ కమిషనర్ మణికొండలోని వివిధ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పారిశుద్ధ్య పనుల నిర్వహణ, చెత్త తొలగింపు, ఖాళీ స్థలాల పరిశుభ్రతపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్య నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలని ఆదేశించారు. పది రోజుల పాటు కొనసాగనున్న ఈ ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు. ప్రజలు కూడా తమ పరిసరాల్లో చెత్త వేయకుండా, మున్సిపల్ సిబ్బందికి సహకరించి పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు భాగస్వాములు కావాలని అధికారులు సూచించారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

- అభివృద్ధికి అడ్డుపడితే సహించేది లేదు.. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల మరమ్మతులకు రూ.7 కోట్లు..
- త్వరలో రూ.5 లక్షల ఇందిరమ్మ జీవిత బీమా



విశాల భారతి, షాద్‌నగర్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రతిపక్షాలు సహకరించాలే తప్ప, అడ్డంకులు సృష్టిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.శుక్రవారం ఫరూక్‌నగర్‌లో మున్సిపల్ చైర్మన్ అగ్గూర్ బస వేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇందిరమ్మ చేయూత' పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు గుర్తింపు పత్రాలు అందజేశారు. పింఛన్ల కోసం వృద్ధులు, దివ్యాంగులు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితిని తొలగించి, ప్రజల వద్దకే సంక్షేమ ఫలాలు చేరుస్తున్నామని తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, పేదలకు సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా మిగిలిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల మరమ్మతులు, పనుల పూర్తికి రూ.7 కోట్లు మంజూరు చేయించామని, త్వరలోనే అర్హులకు ఇళ్లను అందజేస్తామని వెల్లడించారు. అలాగే నవంబర్ 19న రూ.5 లక్షల 'ఇందిరమ్మ జీవిత బీమా' పథకాన్ని ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని తెలిపారు.ప్రతిపక్షాలు అభివృద్ధిలో పోటీ పడాలని, ప్రజలకు ఉపయోగపడే పనులకు అడ్డుపడకూడదని హితవు పలికారు. ''మీరు అభివృద్ధిలో మూడు అడుగులు వేస్తే.. నేను ఏడు అడుగులు వేస్తా'' అంటూ సవాల్ విసిరారు. తన మౌనాన్ని బలహీనతగా భావించి అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు.కార్యక్రమంలో కమిషనర్ సునీతారెడ్డి, కౌన్సిలర్లు,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్,వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సోనియా గాంధీ ఆత్మకథ పుస్తకాన్ని సంతోషంగా స్వీకరించిన మాజీ జెడ్పీటీసీ

- 'ప్రేమ, త్యాగం, పట్టుదల జీవితానికి మార్గదర్శకాలు
- మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి



విశాల భారతి,షాద్‌నగర్: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ రచించిన జీవిత స్మృతుల పుస్తకం 'BELONGING: A JOURNEY OF LOVE' తనకు అందడంతో కేశంపేట మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.ఈ పుస్తకం కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నానని, ఎట్టకేలకు తన చేతుల్లోకి రావడం ఆనందంగా ఉందని తెలిపారు.ప్రేమ, త్యాగం,సహనం, పట్టుదలతో పాటు జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా అధిగమించే మనోనిబ్బరం వంటి విలువైన అంశాలు ఈ పుస్తకంలో ప్రతిబింబిస్తాయని ఆమె పేర్కొన్నారు. సోనియా గాంధీ వ్యక్తిగత జీవితం, కుటుంబ అనుబంధాలు, రాజకీయ ప్రయాణం, భారతదేశంతో ఆమెకున్న అనుబంధాన్ని తెలుసుకునేందుకు ఈ పుస్తకం ఒక మంచి అవకాశమని అభిప్రాయపడ్డారు.పుస్తకంలోని ప్రతి పేజీ ఎన్నో జీవిత పాఠాలను,స్ఫూర్తిదాయకమైన ఆలోచనలను అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ రాత్రి నుంచే పుస్తక పఠనం ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. 'ప్రేమ మనుషులను కలుపుతుంది.. త్యాగం విలువలను చాటుతుంది.. పట్టుదల విజయానికి బాటలు వేస్తుంది' అనే సందేశం ఈ పుస్తకం ద్వారా మరింత స్పష్టమవుతుందని తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి పేర్కొన్నారు.

కాంగ్రెస్ నేతలు అద్దంలో ముఖం చూసుకోవాలి

- ధాన్యం కొనుగోలుపై సమాధానం చెప్పండి.. కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

చౌటుప్పల్, విశాలభారతి: కేటీఆర్ గురించి మాట్లాడే ముందు కాంగ్రెస్ నాయకులు ఒక్కసారి అద్దంలో తమ ముఖం చూసుకోవాలని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. తెలంగాణ అభివృద్ధి గురించి, ఐటీ రంగం గురించి మాట్లాడే నైతిక అర్హత కాంగ్రెస్ కు ఎక్కడిదని ప్రశ్నించారు. కేటీఆర్ అంటే ఒక పేరు కాదని, తెలంగాణ ఐటీ రంగానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిన ఒక లెజెండ్ అని అన్నారు. ఆయన హయాంలో హైదరాబాద్ కు ప్రపంచ స్థాయి ఐటీ కంపెనీలను ఆకర్షించేందుకు చేసిన కృషి, తీసుకొచ్చిన పెట్టుబడులు ప్రజలకు తెలుసని పేర్కొన్నారు. చరిత్రను చెరిపేయాలని చూస్తే అది వారి రాజకీయ అజ్ఞానమే అవుతుందని అన్నారు. ముందు యాదాద్రి భువనగిరి జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న ధాన్యం కొనుగోలు సమస్యపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన వడ్లను కొనుగోలు చేయకుండా మిల్లర్ల చుట్టూ తిప్పుతూ అన్నదాతలను ఇబ్బందులకు గురిచేస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని నిలదీశారు. రైతులు రోడ్లపై ఎదురుచూడాలా, మిల్లర్ల చుట్టూ తిరగాలా అని ప్రశ్నించారు. రైతుల కష్టాలు కనిపించడం లేదా, కేటీఆర్ పై విమర్శలు చేయడానికి ఉన్న సమయం రైతుల సమస్యలు పరిష్కరించడానికి ఎందుకు ఉండటం లేదని అన్నారు. కాంగ్రెస్ నాయకులు ముందు చేతల్లో పాలన చూపించి, ఆ తర్వాత మాటలతో విమర్శలు చేయాలని అన్నారు. హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజల సమస్యలను గాలికి వదిలేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేని పాలనపై ప్రజలు నిలదీస్తున్నారని అన్నారు. కేటీఆర్ ను విమర్శించినంత మాత్రాన తమ వైఫల్యాలు కప్పిపుచ్చుకోలేరని, ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించే రాజకీయాలకు కాలం చెల్లిందని అన్నారు. ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిందేనని హెచ్చరించారు. అధికారం శాశ్వతం కాదని, ప్రజల తీర్పే అంతిమమని ఈ సందర్భంగా కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అధికార పార్టీని తీవ్రంగా హెచ్చరించారు.



నాటుసారా తయారీ కేంద్రాలపై ఎక్సైజ్ ఉక్కుపాదం!

- జిల్లావ్యాప్తంగా మెరుపు దాడులు.. 15 కేసులు నమోదు – 9 మంది అరెస్ట్
- 1,050 లీటర్ల బెల్లంపాకం ధ్వంసం.. 50 లీటర్ల నాటుసారా స్వాధీనం
- రెండు వాహనాలు సీజ్

మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్: జిల్లాలో అక్రమ నాటుసారా తయారీ, విక్రయాలపై ఎక్సైజ్ శాఖ యుద్ధం ప్రకటించింది. అక్రమ మద్యం తయారీ కేంద్రాలపై రెండు ప్రత్యేక బృందాలతో ఏకకాలంలో మెరుపు దాడులు నిర్వహించి అక్రమార్కుల గుండెల్లో గుబులు పుట్టించింది. మహబూబాబాద్, సీరోల్, డోర్నకల్ మండలాల పరిధిలోని పలు తండాలను లక్ష్యంగా చేసుకొని చేపట్టిన ఈ దాడుల్లో 15 కేసులు నమోదు చేసి, 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. భారీగా నాటుసారా తయారీకి వినియోగించే ముడిసరుకును ధ్వంసం చేయడంతో పాటు రెండు వాహనాలను సీజ్ చేశారు. ఎక్సైజ్ శాఖ తెలంగాణ డైరెక్టర్ అవినాష్ మహంతి, జాయింట్ కమిషనర్ జి. అంజన్ రావు ఆదేశాల మేరకు, వరంగల్ డివిజన్ డిప్యూటీ కమిషనర్ హెచ్. దత్తురాజ్ గౌడ్, అసిస్టెంట్ కమిషనర్ నవీన్ కుమార్ పర్యవేక్షణలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి పి. కరమం చంద్ ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. మొదటి బృందం మహబూబాబాద్ మండలంలోని బోడగుట్ట తండా, సుందరయ్య నగర్, బాబు నాయక్ తండా, అమంగల్ తండా ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించింది. ఈ దాడుల్లో 7 కేసులు నమోదు చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకుంది. 23 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకోవడంతో పాటు 450 లీటర్ల బెల్లం పాకాన్ని ధ్వంసం చేసి, 5 కిలోల పరికరను స్వాధీనం చేసుకుంది. ఒక వాహనాన్ని సీజ్ చేసింది. రెండో బృందం సీరోల్ మండలంలోని గుజిలి తండా, రేకుల తండా, బోడ తండా, పాలుగుబోడ తండాతో పాటు డోర్నకల్ మండలంలోని తల్లబండ తండాలో



దాడులు చేపట్టింది. ఈ బృందం 8 కేసులు నమోదు చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకుంది. 27 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని, 600 లీటర్ల బెల్లంపాకాన్ని ధ్వంసం చేసి మరో వాహనాన్ని సీజ్ చేసింది. మొత్తంగా 15 కేసులు.. 9 మంది అదుపులోకి.. 1,050 లీటర్ల బెల్లంపాకం ధ్వంసం: రెండు బృందాల దాడుల్లో 50 లీటర్ల నాటుసారా స్వాధీనం, 1,050 లీటర్ల బెల్లంపాకం ధ్వంసం, 5 కిలోల పరికర స్వాధీనం, రెండు వాహనాల సీజ్ జరిగినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బి. రామ్‌ప్రసాద్ వెల్లడించారు. అక్రమ నాటుసారా తయారీ, రవాణా, విక్రయాలపై ఎక్సైజ్ శాఖ ప్రత్యేక నిఘా కొనసాగిస్తోందని తెలిపారు.

బాలల భద్రతపై పోలీసుల భరోసా



- చట్టాలపై విద్యార్థులకు అవగాహన
- బాల్యవివాహాలు,లైంగిక వేధింపులు,సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

విశాల భారతి, షాద్‌నగర్: బాల్యం బంగారు భవిష్యత్తుకు పునాది.. ఆ బాల్యాన్ని బాల్యవివాహాలు,లైంగిక వేధింపులు,సైబర్ నేరాల బారిన పడకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని షాద్‌నగర్ ఎస్‌హెచ్‌ఓ సీతారాం అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు చట్టాలపై అవగాహన పెంచుకుని,తమ హక్కులను తెలుసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో బాల్యవివాహాల నిరోధక చట్టం,పోక్సో చట్టం,సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, డీసీపీ, షాద్‌నగర్ ఏసీపీ మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు,చట్టపరమైన పరిణామాలు, బాలబాలికల వివాహ వయస్సుపై వివరించారు. బాల్యవివాహాలు జరిగే అవకాశం ఉన్నా, అలాంటి ప్రయత్నాలు గుర్తించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తూ గుడ్ టచ్-బ్యాడ్ టచ్ మధ్య తేడాలు, లైంగిక వేధింపుల నుంచి రక్షణ పొందే మార్గాలను వివరించారు.ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, వేధింపులకు గురిచేసినా భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు ఫిర్యాదు చేయాలని భరోసా కల్పించారు.డిజిటల్ ప్రపంచంలో పెరుగుతున్న సైబర్ ముప్పులపైనా విద్యార్థులను అప్రమత్తం చేశారు.నకిలీ సోషల్ మీడియా ఖాతాలు, ఆన్‌లైన్ మోసాలు, సైబర్ వేధింపులు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌ల దుర్వినియోగం, వ్యక్తిగత ఫొటోలు, సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవడం వల్ల ఎదురయ్యే ప్రమాదాలను వివరించారు. సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటిస్తూ, డిజిటల్ వేదికలను బాధ్యతాయుతంగా ఉపయోగించుకోవాలని సూచించారు.

ఏ సమస్య వచ్చినా పోలీసులు అండగా ఉంటారు

విద్యార్థులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని,ఇతరుల పట్ల గౌరవంగా మెలగాలని, చట్టవిరుద్ధ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించవద్దని ఎస్‌హెచ్‌ఓ సీతారాం సూచించారు. ఏదైనా సమస్య ఎదురైతే భయపడకుండా పోలీసులను సంప్రదించాలని,విద్యార్థుల భద్రతకు పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని భరోసా ఇచ్చారు.

వడ్ల కొనుగోళ్లను వేగవంతం చేయాలి


- రైతులకు పూర్తిస్థాయి మద్దతు ధర అందించాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజగోపాల్ గౌడ్



విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ : రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా వడ్ల కొనుగోలు ప్రక్రియను తక్షణమే వేగవంతం చేసి, పంటకు పూర్తిస్థాయి మద్దతు ధర అందించాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా రూరల్ అధ్యక్షుడు పంతంగి రాజగోపాల్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు శుక్రవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని పలు ఐకేపీ వడ్ల కొనుగోలు కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లో పరిస్థితులను, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వడ్ల కొనుగోళ్లలో జాప్యం జరగకుండా అధికారులు తక్షణమే స్పందించి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. రైతులు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి రాకుండా చూడాలని, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పూర్తిస్థాయిలో అందించి రైతులకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు గూడెపు మధు గౌడ్, డివిజన్ అధ్యక్షులు, బీజేవైఎం నాయకుడు చెవుల శ్రీహరి, బీజేపీ కార్యకర్తలు, స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

షాద్‌నగర్‌లో జువెలరీ షాపులో మహిళ చేతివాటం

- రెండున్నర తులాల బంగారు మంగళసూత్రం మాయం
- సీసీ కెమెరాల్లో చోరీ దృశ్యాలు రికార్డు



విశాల భారతి,షాద్‌నగర్: పట్టణంలోని ప్రధాన రహదారిపై ఉన్న శ్రీకృష్ణ జ్యువెలర్స్‌లో గురువారం మధ్యాహ్నం చోరీ ఘటన కలకలం రేపింది. కొనుగోలుదారులాగా వచ్చిన ఓ మహిళ అదును చూసి సుమారు రెండున్నర తులాల బంగారు మంగళసూత్రాన్ని చాకచక్యంగా అపహరించి అక్కడి నుంచి ఉడాయించినట్లు సమాచారం. మధ్యాహ్న భోజన సమయం కావడంతో సిబ్బంది తక్కువగా ఉండటాన్ని గమనించిన మహిళ తన పథకాన్ని అమలు చేసినట్లు తెలుస్తోంది. షాపులో ఇతర సిబ్బంది పనుల్లో నిమగ్నమై ఉన్న సమయంలో ఎవరి కంటా పడకుండా మంగళసూత్రాన్ని కాజేసి అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం.సాధారణంగా వచ్చి వెళ్లే కస్టమర్ల మధ్య జరిగిన ఈ చోరీ ఘటన వ్యాపార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.అయితే మహిళ చేసిన చేతివాటం షాపులోని సీసీటీవీ కెమెరాల్లో స్పష్టంగా రికార్డైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం చోరీకి సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు వెలుగులోకి రావడంతో ఘటనపై ఆసక్తి నెలకొంది.

ఇంటింటా ఇందిరమ్మ భరోసా

- గౌరీకుంట తండాలో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

విశాల భారతి, షాద్‌నగర్: ఒక పేద కుటుంబం సొంతింటి కల నెరవేరిన వేళ.. అదే తండాలో మరో మూడు నిరుపేద కుటుంబాలకు ఇళ్ల మంజూరుతో ఆనందం రెట్టింపైంది. గృహప్రవేశ వేడుకకు హాజరైన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తండావాసుల విజ్ఞప్తికి అక్కడికక్కడే స్పందించి మరో మూడు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.దీంతో గౌరీకుంట తండాలో పండుగ వాతావరణం నెలకొంది.ఫరూక్‌నగర్ మండలం చించోడ్ గ్రామ పరిధిలోని గౌరీకుంట తండాకు చెందిన రాజు, అరుణ దంపతులు నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ ఇంటిని ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దంపతులకు తోబుట్టువుల్లా నూతన వస్త్రాలు అందజేసి ఆప్యాయతను చాటుకున్నారు.వారి ఆహ్వానం మేరకు ఇంట్లో అల్పాహారం విందు స్వీకరించి కుటుంబ సభ్యులతో ముచ్చటించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో షాద్‌నగర్ నియోజకవర్గానికి తొలి విడతలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. చించోడ్ గ్రామానికి 47 ఇళ్లు కేటాయించగా,గౌరీకుంట తండాలో ముగ్గురికి ఇళ్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో ఇల్లు నిర్మించుకుని గృహప్రవేశం చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. తండాలో ఇంకా ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలు ఉన్నాయని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించారు. అదనంగా మరో మూడు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. పేదలు, గిరిజనులు, మహిళల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, సర్పంచులు బాబు నాయక్, యాదగిరి, రామకృష్ణ, దేవునిపల్లి మల్లేష్, రమేష్, చించోడ్ సర్పంచ్ ఆర్. శ్రీనివాస్, సీనియర్ నాయకులు అనంతం, మున్నా బాబా, శ్రీధర్

వెంట్రుకవాసిలో తప్పిన మృత్యువు

దాదాపు రెండు దశాబ్దాలుగా దక్షిణాది, ఉత్తరాది ప్రేక్షకులను తన అందం, అభినయంతో అలరిస్తున్న స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న ఈ ముద్దుగుమ్మ, ఇప్పటికీ వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఇటీవల విడుదలై బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంటున్న 'రామాయణ' చిత్రంలో రావణుడి భార్య మండోదరి పాత్రలో కనిపించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంటున్నారు. ఈ క్రమంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన జీవితంలో ఎదురైన అత్యంత భయానక సంఘటనను గుర్తుచేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. సుమారు ఆరేళ్ల క్రితం జరిగిన క్రేన్ ప్రమాదంలో తాను తృటిలో ప్రాణాలతో బయటపడిన విషయాన్ని వెల్లడించారు. 2020లో ప్రముఖ దర్శకుడు శంకర్ తెరకెక్కిస్తున్న 'ఇండియన్ 2' సినిమా షూటింగ్ సమయంలో జరిగిన ఘోర ప్రమాదం అప్పట్లో చిత్ర పరిశ్రమను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. చెన్నైలోని ఈవీపీ ఫిల్మ్ సిటీలో చిత్రీకరణ జరుగుతుండగా భారీ క్రేన్ ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ప్రమాదంలో ముగ్గురు సిబ్బంది ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఆ సమయంలో సెట్‌లోనే ఉన్న కాజల్ అగర్వాల్ కూడా తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. తాజా ఇంటర్వ్యూలో ఆ ఘటనను గుర్తుచేసుకున్న కాజల్.. తన జీవితంలో అదొక ఎప్పటికీ మర్చిపోలేని పీడకల అని పేర్కొన్నారు. ఆరోజు సినిమాలో ఓ కీలకమైన యాక్షన్ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్నారని, తాను 80 ఏళ్ల వృద్ధురాలి పాత్ర కోసం ప్రత్యేక ప్రోస్థెటిక్ మేకప్ వేసుకున్నానని తెలిపారు. షూటింగ్ సెట్‌లోని మానిటర్ వద్ద కూర్చుని ఉండగా ఒక్కసారిగా భారీ శబ్దం, ఆర్తనాదాలు వినిపించాయని చెప్పారు. ఏం జరిగిందో అర్థం చేసుకునేలోపే సుమారు 100 అడుగుల ఎత్తున్న భారీ క్రేన్ కుప్పకూలిందని కాజల్ గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో సెట్‌లో ఉన్నవారంతా ప్రాణభయంతో పరుగులు తీశారని తెలిపారు. తాను కూడా అక్కడి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో ఓ టేబుల్‌ను బలంగా ఢీకొని కిందపడిపోయానని వెల్లడించారు. అయితే ఆ భారీ క్రేన్ తనవైపే కూలాల్సి ఉందని, కేవలం కొన్ని సెకన్ల వ్యవధిలోనే తాను పెను ప్రమాదం నుంచి బయటపడ్డానని కాజల్ తెలిపారు. ఆ సమయంలో ఏం జరిగిందో, ఎలా ప్రాణాలతో బయటపడ్డానో తనకు ఇప్పటికీ ఆశ్చర్యంగానే ఉంటుందని భావోద్వేగానికి గురయ్యారు. ఆ ఘటన తన జీవితంలో అత్యంత భయానకమైన అనుభవమని చెప్పారు. ఈ సందర్భంగా మరో ఆసక్తికరమైన విషయాన్ని కూడా కాజల్ పంచుకున్నారు. ప్రమాదం జరగడానికి సరిగ్గా వారం రోజుల ముందే సింగపూర్‌లోని ప్రముఖ మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో తన మైనపు విగ్రహాన్ని ఆవిష్కరించుకున్నానని తెలిపారు. ఒక నటిగా తన కెరీర్‌లో అదొక గొప్ప మైలురాయి అని, ఆ ఆనందంలో ఉన్న సమయంలోనే ఇలాంటి ఘోర ప్రమాదాన్ని ఎదుర్కోవాల్సి వచ్చిందని గుర్తుచేసుకున్నారు. ఒకవైపు కెరీర్‌లో అరుదైన గౌరవం దక్కిన సంతోషం, మరోవైపు కళ్లముందే మృత్యువు కనిపించినంతటి భయంకరమైన అనుభవం.. ఈ రెండింటి మధ్య కేవలం వారం రోజుల వ్యవధి ఉండటం తనను తీవ్రంగా కలిచివేసిందని చెప్పారు. ఆ ప్రమాదం నుంచి ఎలాంటి పెద్ద గాయాలు కాకుండా బయటపడటం తనకు పునర్జన్మ లాంటిదని పేర్కొన్నారు.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.